



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## హ్యాపీ రక్షా బంధన్

రక్షా బంధన్ సందర్భంగా మంగళగిరిలో మంత్రి లోకేష్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

# రాజధాని గ్రామాల్లో మౌలికవసతులు



- అదనంగా మరో రూ.533 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్
- దేశంలోనే తొలి క్వాంటమ్-ఏఐ యూనివర్శిటీ
- శాకమూరులో సెంట్రల్ లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్‌ఆర్ భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లు
- అమరావతి నుంచే మంగళగిరికి తాగునీటి సరఫరా
- కొత్తగా ల్యాండ్ పూలింగ్ చేసే రైతులకు రుణమాఫీ
- రాజధాని ప్రాంతంలోని గ్రామాలలో ఇక బీటీ రోడ్లు
- వివిధ ప్రాజెక్టులకు అదనపు భూములకు కొత్త విధానం
- డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం ఏర్పాటుకు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్
- సీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశంలో ఆమోదం

2

సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ సీఆర్‌డీఏ 65వ అథారిటీ సమావేశంలో పలు కీలక అంశాలకు ఆమోద ముద్ర వేశారు. రాజధాని అమరావతిలోని 29 గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు మరో రూ.533 కోట్లు మంజూరు చేశారు. శాకమూరులో సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్‌ఆర్‌కు సంబంధించిన భవనాల నిర్మాణానికి రూ.596కోట్లతో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదించారు. ఇప్పటికే వివిధ ప్రాజెక్టులకు భూములు కేటాయించిన ప్రాంతాల్లో పక్కనే కొంతమేర అదనంగా భూమి కేటాయింపునకు కొత్త విధానాన్ని తీసు కొచ్చారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ దేశంలోనే తొలి క్వాంటమ్-ఏఐ డీమ్డ్ యూ నివర్సిటీ ఏర్పాటు చేయడానికి 8.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది.

## తెలుగువారి భద్రత ముఖ్యం

- గల్లంతైన వారి ఆచూకీ కనుగొనాలి
- కుటుంబసభ్యులకు సమాచారం అందించాలి
- కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ముఖ్యం
- నేపాల్ వరదలు, ఏపీ వాసుల పరిస్థితిపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- సురక్షితంగా తీసుకురావాలని ఆదేశం

3



నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అధికారులతో సమీక్షించారు. చేపడుతున్న సహాయక చర్యలను తెలుసుకున్నారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకోగా ఇప్పటివరకు 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందని అధికారులు వివరించారు. నేపాల్‌లో చిక్కుకున్న ప్రతిఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, భారత రాయ బార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించా లని ఆదేశించారు. ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## నేడు ప్రకాశం జిల్లాలో లోకేష్ పర్యటన

- ఒంగోలులో ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ
- అమృత్-2 డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ ప్రారంభం
- రాడిసన్ హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన
- పార్టీ శ్రేణులతో సమన్వయ సమావేశం



ఒంగోలు(చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ శుక్రవారం ప్రకాశం జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత ఉదయం 09.40 - 10.30 గంటల వరకు సంత నూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద రాడిసన్ హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్య క్రమంలో పాల్గొంటారు. తర్వాత 11.35-12.05 గంటల వరకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ జంక్షన్ లో ప్రకాశం జిల్లాకు చెందిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12.05 - 12.30 ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద అమృత్-2 పథకం కింద డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారు. 01.30 - 04.30 ఒంగోలు రామ్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన వేదికలో ఒంగోలు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు.

## మంగళగిరిలో మోడరన్ రైతుబజార్

మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన

రూ.18.55 కోట్ల వ్యయంతో నిర్మాణం

మంగళగిరి పట్టణం నిడమర్రు రైల్వేగేట్ వద్ద ఆధునిక హంగులతో మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు గురువారం మంత్రి నారా లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ముందు గా నిడమర్రు రోడ్డులోని శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న లోకేష్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టు నమూనా చిత్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

4



## నేపాల్‌లో తెలుగు యాత్రికుల భద్రతకు చర్యలు

- క్షేమ సమాచారంపై మంత్రి లోకేష్ సమీక్ష
- ఢిల్లీ ఏపీ భవన్ అధికారులకు సూచనలు
- సురక్షితంగా తీసుకురావాలని ఆదేశం
- ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షణ




5

## క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

- నేడు క్యాడర్‌కు శిక్షణ తరగతులు
- దిశానిర్దేశం చేయనున్న అధినేత చంద్రబాబు
- ఇప్పటివరకు విజయవంతంగా 50 బ్యాచ్‌లు
- ప్రత్యేక శిక్షణకు 7,109 మంది హాజరు

5




పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియకు టీడీపీ అధినేత చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ వారిలో నూతనోత్సాహం నింపుతున్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగే శిక్షణ తరగతుల కు అధినేత పాల్గొని దిశానిర్దేశం చేయనున్నారు.

## నిర్వాసితుల త్యాగం లేకుండా.. వెలిగొండ కథ లేదు!

- 6,206 కుటుంబాలు.. రూ.768 కోట్లు..
- 48 రోజుల్లో మూడు విడతలుగా పరిహారం చెల్లింపు
- ప్రాజెక్టు వెనుక నిశ్శబ్ద త్యాగాల కథ

8



కరవు నేలకు
కృష్ణమ్మ పరుగులు

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర
- వెలిగొండ జలకళకు శ్రీకారం
- సాగు, తాగునీటికి శాశ్వత భరోసా
- ఆగస్టు 31న వెలిగొండ తొలిదశ ప్రారంభం
- 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు
- 15.25 లక్షలమందికి తాగునీరు

కౌంట్ డౌన్ 4

# రాజధాని గ్రామాల్లో మౌలికవసతులు

- అదనంగా మరో రూ.533 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్
- శాకమూరులో సెంట్రల్ లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్ఆర్ భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లు
- అమరావతి నుంచే మంగళగిరికి తాగునీటి సరఫరా
- కొత్తగా ల్యాండ్ పూలింగ్ చేసే రైతులకు రుణమాఫీ
- ఇన్నర్ రింగ్‌రోడ్, రైల్వే లైన్లకు రాజధాని వరకు ఉన్న భూములకు ల్యాండ్ పూలింగ్‌కు అనుమతి
- అమరావతిలో గ్రీన్‌ఎనర్జీ అభివృద్ధికి ఐఓసీఎల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు అనుమతి
- రాజధాని ప్రాంతంలోని గ్రామాలలో ఇక బీటీ రోడ్లు
- వివిధ ప్రాజెక్టులకు అదనపు భూములకు కొత్త విధానం
- డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం ఏర్పాటుకు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్
- సీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశంలో ఆమోదం



అమరావతి(చైతన్యరథం): సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ సీఆర్‌డీఏ 65వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్‌తో పాటు, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ విజయ్‌రామరాజు హాజరయ్యారు. కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతోనూ సీఎం సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణం పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశం అనంతరం సీఆర్‌డీఏ ఆమోదించిన అంశాలను మంత్రి నారాయణ మీడియా సమావేశంలో వెల్లడించారు.

### రాజధానిలో మౌలికవసతులకు అదనపు నిధులు

రాజధాని అమరావతిలోని 29 గ్రామాల్లో రూ.1,437 కోట్లతో పెద్దఎత్తున మౌలికవసతుల కల్పన చేపడుతున్నారు. ఇప్పటికే దీని కోసం రూ.904 కోట్లకు ఆమోదం తెలపగా తాజాగా మరో రూ.533 కోట్లకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. 2014 –19 మధ్య రాజధాని కోసం భూములిచ్చిన 29 గ్రామాల్లో క్రిటిక ల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రాజధానిలో మౌలికవసతుల మాదిరిగానే గ్రామాల్లో కూడా రోడ్లు, డ్రైన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి లైన్లు, వీధి దీపాలు తదితర మౌలికవసతులు కల్పించనున్నారు. అమరావతిలో యూజీడీ వ్యవస్థ ఉన్నందున 29 గ్రామాల్లో కూడా యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రోజుకు ఒక్కొక్కరికి 40 లీటర్లు నీరు అందిస్తుండగా లెక్కల ప్రకారం ఒక్కో వ్యక్తికి 135 లీటర్లు అందిం చాల్సి ఉంది. ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా పైపు లైన్లు కూడా పూర్తిగా మార్చే ప్రతిపాదనకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపిం ది. ఆయా గ్రామాల గుండా వెళుతున్న ట్రంక్ రోడ్లకు ల్యాండ్ టూ ల్యాండ్ ఇవ్వడానికి సైతం ఈ నిధులు వినియోగించ్ నున్నారు.

### రూ.596 కోట్లతో సెంట్రల్ లైబ్రరీ

శాకమూరులో సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్‌ఆర్‌కు సంబంధించిన భవనాల నిర్మాణానికి రూ.596 కోట్ల విలువతో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపారు. 29 గ్రామాల్లో ఎల్పీఎస్ లేఅవుట్లలోని చిన్న రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించాలని తొలుత నిర్ణయించారు. ఇందుకు సీఆర్‌ఆర్‌ఐ న్యూఢిల్లీ, ఐఐటీ ఖరగ్‌పూర్ సంస్థలతో అధ్యయనం చేయించారు. అయితే అమరావతి ప్రాంతంలోని నేల స్వభావం, భవిష్యత్‌లో పెరగనున్న వాహనాలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్లకు బదులు గా బీటీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ అభివృద్ధికి సంబంధించి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసేందుకు సీఆర్డీఏకు అథారిటీ అనుమతి ఇచ్చారు.

### 42 ఎకరాల్లో వివిధ ప్రాజెక్టుల అభివృద్ధికి ఆమోదం

అమరావతిలో ప్రభుత్వం నిర్మించే కార్యాలయాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా అభివృద్ధి జరిగేలా 42 ఎకరాల్లో వివిధ ప్రాజెక్టులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చారు. దీనికోసం పిచ్చుకలపాలెంలో 7.9 ఎకరాలు, తుళ్లూరులో 5 ఎకరాలు, మందడంలో 12.38 ఎకరాలు, మరో ప్రాంతంలో 6 ఎకరాలు, కురగల్లులో 6 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను గుర్తించారు.

### అదనపు భూముల కేటాయింపునకు కొత్త విధానం

హోటళ్లు, పాఠశాలలు, ఇతర ప్రాజెక్టులకు ఇప్పటికే భూము లు కేటాయించిన ప్రాంతాల్లో పక్కనే కొంతమేర అదనంగా కోరు తున్న వారి కోసం కొత్త విధానాన్ని తీసుకొచ్చారు. త్రీ స్టార్, ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లు, నేషనల్, ఇంటర్నేషనల్ స్కూల్స్ అదనపు భూమిని కోరితే అమరావతిలోని ప్రస్తుత కనీస ధరపై కనీసం 250 శాతం ధరకు కేటాయించేందుకు అథారిటీ అనుమ తి ఇచ్చింది. అమరావతిలో ప్రస్తుత కనీస ధర ఎకరాకు రూ.4.1 కోట్లు కాగా, ఇక అదనంగా భూమి కోరితే కనీసం ఎకరాకు రూ.10.25 కోట్లకు తగ్గకుండా భూమిని కేటాయించనున్నారు.

### ల్యాండ్ పూలింగ్ రైతులకు రూ.1.50 లక్షల రుణమాఫీ

ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లోని రైతులకు ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకూ రుణమాఫీ చేసేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. 2026 జనవరి 1వ తేదీకి ముందు తీసుకున్న రుణాలకు ఇది వర్తించనుంది.

### మంగళగిరికి అమరావతి నుంచి తాగునీరు

అమరావతి క్యాపిటల్ సిటీ నుంచి మంగళగిరి కార్పొరేషన్‌కు తాగునీరు అందించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ప్రస్తు తం మంగళగిరికి 30 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండగా, రాబో యే 30 సంవత్సరాల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో 80 ఎంఎల్‌డీ వరకు నీటి అవసరాలను పరిగణన లోకి తీసుకునేలా ప్రణాళిక రూపొందించనున్నారు. అమరావతిలో నిర్మిస్తున్న స్టోరేజీల నుంచి మంగళగిరికి నీటిని అందించేందుకు కిలో లీటర్‌కు రూ.10 చొప్పున ధర నిర్ణయించి సరఫరా చేయ డానికి అథారిటీ అంగీకరించింది.

### ఐఓసీఎల్‌తో గ్రీన్ ఎనర్జీ కోసం ఎంఓయూ


అమరావతిలో గ్రీన్ ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)తో అవగాహనఒప్పందం కుదుర్చుకునేందుకు సీఆర్డీఏకు అథారిటీ అనుమతి ఇచ్చారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అమరావతిలో డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి 8.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది.

### తాడికొండ, కంతేరులో ల్యాండ్ పూలింగ్

తాడికొండ, కంతేరు ప్రాంతాల మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే ట్రాక్ వెళుతుండటంతో వాటి పరిధిలోని క్యాపిటల్ సిటీ వరకు ఉన్న భూములను ల్యాండ్ పూలింగ్‌లోకి తీసుకునేందుకు సీఆర్డీఏకు అథారిటీ అనుమతి ఇచ్చింది.

# క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

- చిలకలూరిపేట ఘటనపై సీఎం చంద్రబాబు ఆదేశం
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



అమరావతి(చైతన్యరథం): పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతిచెందడం, పలువురు తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నా రు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమా ద ఘటన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతిచెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారిగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించా లని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

### పల్నాడు ఘటనపై లోకేష్ దిగ్భ్రాంతి

పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందిన ఘటనపై మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లి తిరిగొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుం దని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## వివాహ వేడుకల్లో సీఎం చంద్రబాబు

*తాడిగడపలో డాక్టర్ సూరపనేని సురేష్‌బాబు కుమార్తె సుప్రభ వివాహ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై వధూవరులు సుప్రభ, రామచంద్రమూర్తి ఆశీర్వదించారు.*

### రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు రక్షాబంధన్ శుభాకాంక్షలు

*రాష్ట్ర ప్రజలందరికీ సీఎం చంద్రబాబు ఒకప్రకటనలో రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ మీ జీవితంలో ఆనందం,ఆరోగ్యం, సంతోషం నింపాలి. ఈ రాఖీ పౌర్ణమి మీ జీవితాల్లో వెలుగులు పంచి ప్రేమానుబంధాలు నింపాలి.. సహోదర భావంతో సమాజం నిండిపోవాలని ఆకాంక్షించారు.*

# ప్రతిఒక్కరి క్షేమం ముఖ్యం

- గల్లంతైన వారి ఆచూకీ కనుగొనాలి
- కుటుంబసభ్యులకు సమాచారం అందించాలి
- కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ముఖ్యం
- నేపాల్ వరదలు, ఏపీ వాసుల పరిస్థితిపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- సురక్షితంగా తీసుకురావాలని ఆదేశం



అమరావతి(చైతన్యరథం): నేపాల్‌లో సంభవించిన భారీ వరద ల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలను అధికారులు వివరించారు. మానస సరోవర్ యాత్ర వెళ్లిన ఏపీకి చెందిన పలువురు యాత్రికులు నేపాల్ వరదల్లో చిక్కుకున్నారని తెలిపారు. వీరికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్టు ఇప్పటివరకు గుర్తించామని, వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండటంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. కర్నూలు-ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని.. వారితో తాము మాట్లాడామని వివరించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండూలో సురక్షితంగా ఉన్నారని వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించినట్టు చెప్పారు. ఇక చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతు అయ్యారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఏడుగురిలో ముగ్గురు ఈషా ఫౌండేషన్ తరపున మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి ఫోన్లు అందుబాటులో లేవని వివరించారు. బాధిత కుటుంబాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం సమాచారాన్ని సేకరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వంతో పాటు... ఖాట్మండూ, చైనా ల్లోని ఎంబసీలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.

### ప్రతిఒక్కరి ఆచూకీని ట్రాక్ చేయాలి

నేపాల్‌లో చిక్కుకున్న ప్రతిఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ వారి కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఆదేశించారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరణతోపాటు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షిత తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండ కూడదని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తాజా వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశించారు.



### ఏపీ వాసుల కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్

నేపాల్లో వరదల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఢిల్లీ లోని ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నేపాల్‌లో వరదల కారణంగా ఇబ్బందుల్లో ఉన్న ఏపీ వాసులు, వారి కుటుంబసభ్యులు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి సమాచారం అందించవచ్చు. సహాయం కోసం ఏపీ భవన్ కంట్రోల్ రూమ్ 011-23384016, 011- 23387089 నెంబర్లను, వాట్సాప్ 9059824101ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# జెన్‌జీని అభివృద్ధిలో భాగస్వాములను చేయాలి

- యువతను తక్కువ అంచనా వేయొద్దు
- ప్రామాణికతను, క్రియాశీల భాగస్వామ్యాన్ని వారు కోరుకుంటున్నారు
- రాజకీయ నాయకులు ఇగోను వీడి నిర్ణయాల్లో వారిని భాగం చేయాలి
- రాజకీయాలు, పరిపాలనలో జెన్‌జీలపై మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు




ముంబై: సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువతను క్రియాశీల భాగస్వాములుగా చేయాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. ముంబైలో బుధవారం జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40 అవార్డుల కార్యక్రమంలో లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రాజకీయాలు, పాలనలో జెన్‌జీ యువతను భాగస్వామ్యం చేయడం ప్రాముఖ్యత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. యువతరంతో తన అనుభవాన్ని పంచుకుంటూ..తాను నేర్చుకున్న అతి పెద్ద పాఠం చాలా సులభమైనదని పేర్కొన్నారు. వారిని తక్కువ చేసి మాట్లాడవద్దు..వారిని మొత్తం అభివృద్ధి ప్రయాణం లో భాగం చేయాలని సూచించారు. జెన్‌జీ యువతతో తన అనుబంధం రాజకీయాలపై ప్రస్తుత ఉద్యమానికి చాలాముందే ప్రారంభమైందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి, ఒక మంత్రిగా నేను వారిని పలుమార్లు కలిశాము. మేము ఒక నియోజకవర్గానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్లని కలుస్తూ ఉంటాం. మేము ఇంకా బాగా ఎలా చేయగలమని మీరు అనుకుంటున్నారు? ఈ నియోజకవర్గంలో మనం భిన్నంగా ఏమి చేయగలమని మీరు భావిస్తున్నారు? అని వారిని అడుగుతామని తెలిపారు. ఇటువంటి సంభాషణల నుంచి అద్భుతమైన ఆలోచనలు వస్తాయని, ముఖ్యంగా వారి సూచనలను అనుసరించడానికి తమ వద్ద ఒక వ్యవస్థ ఉందని తెలిపారు. మీకు ఎంతో అద్భుతమైన ఆలోచనలు వస్తాయి..వాటిని మేము ఫాలో-అప్ చేసే విధానం ఉంది. కాబట్టి వారిని సంభాషణలో భాగం చేయండి.. అదే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను అని పేర్కొన్నారు. కొత్త తరం అంచనాలకు అనుగుణంగా రాజకీయ నాయకులు మారాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ..రాజకీయ నాయకులు తమ ఇగోలను వీడి ప్రామాణికతను అలవర్చుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. రాజకీయ నాయకులుగా మనం మన బ్యారియర్స్‌ను వదిలేయడం ముఖ్యమని నేను భావిస్తున్నాను. ఈ రోజుల్లో యువత మీతో చాలా భావోద్వేగ స్థాయిలో కలవడానికి సిద్ధంగా ఉన్నారు. వారు మీ నుంచి ప్రామాణికతను ఆశిస్తున్నారని తెలిపారు. ప్రామాణికత, పారదర్శకత భారతదేశంలో తదుపరి తరం రాజకీయ నాయకులకు నిర్వచించే లక్షణాలుగా ఉంటాయని అన్నారు. భారతదేశంలో తదుపరి తరం రాజకీయ నాయకుల నుంచి వారు ఆశిస్తున్నది అదేనని నేను నమ్ముతున్నానని పేర్కొన్నారు.

# మంగళగిరిలో మోడరన్ రైతుబజార్

## మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన - రూ.18.55 కోట్ల వ్యయంతో నిర్మాణం





మంగళగిరి(చైతన్యరథం): దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ నేతృత్వం లో వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళగిరి పట్టణం నిడమర్రు రైల్వేగేట్ వద్ద ఆధునిక హంగులతో మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమిపూజ, శంకు స్థాపన చేశారు. ముందుగా నిడమర్రు రోడ్డులోని శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న లోకేష్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మోడరన్ రైతుబజార్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రాజెక్టు నమూనా చిత్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచు కుని మంత్రి లోకేష్ మోడరన్ రైతుబజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

### ఆధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

5.90 ఎకరాల విస్తీర్ణంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులు రూ. 18.55 కోట్ల వ్యయంతో ఈ రిటైల్ అండ్ హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశు భ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులు. రిటైల్ మార్కెట్‌లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60 షాపులు ఏర్పాటు చేస్తారు. హోల్‌సేల్ మార్కెట్‌లో అన్ లోడింగ్ ప్లాట్‌ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ జీ.భీముడు, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేష న్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, రూరల్ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత పాల్గొన్నారు.











# ఆతిథ్య రంగంలో పెట్టుబడుల జోరు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 స్టార్ హోటళ్ల నిర్మాణం
- జాబితాలో ఒబెరాయ్, ఐటీసీ, హయత్, హిల్టన్, లెమన్ ట్రీ
- పూర్తయితే అందుబాటులో కొత్తగా 2,532 రూమ్‌లు
- పర్యాటక రంగం అభివృద్ధికి మరింత ఊతం



విశాఖపట్నం(చైతన్యరథం): ఉమ్మడి విశాఖ జిల్లాలో పరిశ్రమ లు పెద్దఎత్తున ఏర్పాటవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయి. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు వెల్లువ లా వస్తున్నాయి. వాటి వ్యాపార అవసరాలను తీర్చేందుకు, ఇక్కడి కి వచ్చే పర్యాటకులకు వసతిసౌకర్యాలు కల్పించేందుకు ప్రముఖ సంస్థలు స్టార్ హోటళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. దాదాపు 15 కొత్త స్టార్ హోటళ్లు ఈ జాబితాలో ఉన్నాయి. కొన్ని ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకోగా, మరికొన్ని సగం పనులు పూర్తయ్యా యి. ఇంకొన్ని శంకుస్థాపనలు చేసుకున్నాయి. ఇవి పూర్తయితే కొత్తగా 2,532 అత్యాధునిక వసతులు కలిగిన రూమ్‌లు అందుబా టులోకి వస్తాయి. విశాఖలోని స్టార్ హోటళ్లలో ప్రస్తుతం 1,800 రూమ్‌లు ఉన్నాయి. ఆ తరువాత స్థాయి హోటళ్లను కూడా కలుపు కుంటే మొత్తం 2,500 రూమ్‌లు అందుబాటులో ఉన్న సాధారణ రోజుల్లో 68 నుంచి 70 శాతం ఆక్యుపెన్సీ ఉంటోంది. అదే పెళ్లిళ్ల సీజన్, సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు, నేవీ కార్యక్రమాలు వంటివి జరిగినప్పుడు వీవీఐపీలకు కూడా రూమ్‌లు లభించడం లేదు.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటకం అభివృద్ధి చెందేలా కొత్త హోటళ్ల నిర్మాణం జరగాలని, పెట్టుబ డిదారులను ఆకర్షించాలని అధికారులకు ఆదేశించారు. దాంతో పరిశ్రమల శాఖాధికారులు, జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కలిసి వ్యాపారవేత్తలకు అనుకూలమైన భూములు చూపించారు. ప్రభు త్వం రాయితీలు ఇవ్వడానికి అంగీకరించింది. దాంతో చాలా మంది ఒప్పందాలు చేసుకున్నారు.

### స్టార్ హొటళ్లు ఇవే

- ఆర్కే బీచ్‌రోడ్డులో గల తాజ్ హోటల్‌ను వరుణ్ గ్రూపు తీసుకుని అక్కడ రూ.900 కోట్లతో స్టార్ హోటల్‌తో పాటు సర్వీస్ అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టింది. ఇక్కడ ఐటీ సంస్థలకు కూడా ఆఫీస్ స్పేస్ లభిస్తుంది.
- భోగాపురం విమానాశ్రయంలోనే తాజ్ వివంతా హోటల్ నిర్మాణం దాదాపు పూర్తయింది. మొత్తం 156రూమ్‌లు ఉన్నాయి.ఇది అక్టోబరులో ప్రారం భం కానుంది. విమానాశ్రయంలో దిగిన వారు విశాఖ వరకు రాకుండా అక్కడే బస చేయొచ్చు.
- ఒబెరాయ్ గ్రూపు భీమిలి మండలం అన్నవరంలో 42 ఎకరాల్లో రూ.350 కోట్ల పెట్టుబడితో 300 లగ్జరీ విల్లాలు నిర్మిస్తోంది. ఇది బీచ్ రిసార్ట్‌గా రూపుదిద్దుకుంటోంది.
- వెస్టిన్ హోటళ్లతో లైలా గ్రూపు ఒప్పందం చేసు కుని రుషికొండ ఐటీ పార్కు సమీపాన రూ.405 కోట్లతో 716రూమ్‌లతో స్టార్‌హోటల్ నిర్మిస్తోంది. ఇందులో మొదటి దశలో 300 రూమ్‌లు అందుబాటులోకి వస్తాయి.
- భీమిలిమండలం అన్నవరంలోనే మేఫెయిర్ సంస్థ రూ.400కోట్లతో 40ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్ నిర్మిస్తోంది.
- విశాఖ నగర నడిబొడ్డున సిరిపురం జంక్షన్‌లో ఐటీసీ కంపెనీ రూ.328కోట్లతో ఏడు నక్షత్రాల హోటల్ నిర్మిస్తోంది. అందులో 200 రూమ్‌లు ఉంటాయి.
- రాడీసన్ హోటల్ యాజమాన్యం పెదగంట్యాడలో ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో రూ.100కోట్లతో స్టార్ హోటల్ నిర్మిస్తోంది.
- భీమిలి సమీపాన కొత్తవలసలో శారదాపీఠం నుం చి వెనక్కి తీసుకున్న భూమిని ప్రభుత్వం మైరా గ్రూపునకు అప్పగించింది. అందులో రూ.196 కోట్లతో స్టార్ హోటల్ నిర్మాణం చేపట్టారు.
- మధురవాడలో హిల్టన్ గార్డెన్ అండ్ కన్వెన్షన్ సెంటర్ సంస్థ 250 రూమ్‌లతో స్టార్ హోటల్ నిర్మిస్తోంది.
- ఎండాడ ప్రాంతంలో హయత్ సెంట్రిక్ 200 రూమ్‌లతో స్టార్ హోటల్ నిర్మిస్తోంది.
- వీ హోటల్ గ్రూపు లెమన్ ట్రీతో ఒప్పందం చేసుకొని రుషికొండలో 100 రూమ్‌లతో స్టార్ హోటల్ నిర్మాణం చేపట్టనుంది.
- రుషికొండలో క్రౌన్ ప్లాజా 152 రూమ్‌లతో స్టార్ హోటల్ నిర్మాణానికి అనుమతులు తీసుకుంది.

# క్షేత్రస్థాయి బలోపేతమే లక్ష్యం



- నేడు పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతులు
- దిశానిర్దేశం చేయనున్న అధినేత చంద్రబాబు
- ఇప్పటివరకు విజయవంతంగా 50 బ్యాచ్‌లు
- ప్రత్యేక శిక్షణకు 7,109 మంది హాజరు

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశంచేస్తూ వారిలో నూతనోత్సాహం నింపుతున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాల యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల కు ఆయన క్రమం తప్పకుండా హాజరవుతూ పార్టీ శ్రేణులకు ఆదర్శం గా నిలుస్తున్నారు. అదే సమయంలో పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇస్తున్నారు. ఇప్పటివరకు 50 బ్యాచ్‌లకు విజయవంతంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులకు 14 బ్యాచ్‌లుగా ప్రత్యేక తరగతు లు చేపట్టి 1,533 మందికి శిక్షణ ఇచ్చారు. క్లస్టర్ ఇన్‌ఛార్జ్, కో ఇన్‌ఛార్జ్‌లకు 17 బ్యాచ్ లుగా నిర్వహించి 2,775 సభ్యులకు పార్టీ విధివిధానాల గురించి శిక్షణ ఇచ్చారు. యూనిట్ ఇన్‌ఛార్జ్‌లకు ఇప్పటివరకు 19 బ్యాచ్‌లకు తరగతు లు నిర్వహించగా 2,801మంది సభ్యు లు శిక్షణ తీసుకున్నారు. మొత్తంగా 50 బ్యాచ్‌లుగా నిర్వహించిన ఈశిక్షణ తరగతుల్లో 7,109 మంది పాల్గొన్నా రు. పార్టీ సీనియర్ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈశిక్షణ శిబిరాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కలిసి కాఫీ తాగు తూ వారితో నేరుగా సంభాషిస్తున్నారు. ఈ సందర్భంగా రాజకీయ, పరిపాలన అంశాలపై తన సుదీర్ఘ అనుభవాన్ని పంచుకుంటున్నారు.

గతానుభవాలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరి స్తున్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమ లు తీరుపై కార్యకర్తల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ స్వీకరిస్తున్నారు. శుక్రవారం సైతం పార్టీ అధినేత ఈ శిక్షణ తరగ తుల్లో పాల్గొని దిశానిర్దేశం చేయనున్నారు.

# నేపాల్‌లో తెలుగు యాత్రికుల భద్రతకు చర్యలు

- క్షేమ సమాచారంపై మంత్రి లోకేష్ సమీక్ష
- ఢిల్లీ ఏపీ భవన్ అధికారులకు సూచనలు
- సురక్షితంగా తీసుకురావాలని ఆదేశం
- ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షణ



అమరావతి(చైతన్యరథం): నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రి కుల క్షేమ సమాచారంపై మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. వరదల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. నలుగురు సురక్షితంగా ఉన్నారని.. మరో ముగ్గురు ఆచూకీ లభ్యం కాలేదని ఢిల్లీలోని ఏపీ భవన్ అధికా రులు వివరించారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాలసుబ్రహ్మ ణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మి లు ఆచూకీ లభించలేదని వెల్లడించారు. గల్లంతైన ముగ్గురి ఆచూ కీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపు లు జరపాలని లోకేష్ వారికి సూచించారు. చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద చివరిసారిగా కనిపించిన ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ కనిపించారు. కైలాస మానససరోవర యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్న కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు క్షేమంగానే ఉన్నారు. సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని లోకేష్ ఆదేశిం చారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతర సంప్రదింపులు జరపాలని సూచిం చారు. మరోవైపు నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులు, మానస సరోవర యాత్రకు వెళ్లిన ఏపీ వాసులు సమాచారాన్ని ఆర్టీజీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్క ర్ నిరంతరం మానిటర్ చేస్తున్నారు.




### తిరుపతి నుంచి 28 మంది యాత్రికులు

నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రీకుల వివరాలను, వారి క్షేమ సమాచారాన్ని ఆర్టీజీఎస్ సేకరిస్తోంది. మానస సరోవర యాత్రకు వెళ్లి చిక్కు కున్న వారిలో తెలుగు వారు ప్రత్యేకించి ఏపీ వాసులు ఎవరైనా ఉన్నారని ఆరా తీస్తున్నారు. మానస సరోవర యాత్రను నిర్వహించే వివిధ టూరిస్ట్ సంస్థలు, ఏజెన్సీలతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన 28 మంది తో కూడిన యాత్రికుల బృందం ఖాట్మాండులో ఉన్నట్టు గుర్తించా రు. ఖాట్మాండులోని యెల్లకొండ వద్ద ఒక హోటల్‌లో ఆ బృందం బస చేసింది. ఎలాంటి సహాయం అవసరమైనా తక్షణం తమను సంప్రదించాలని ఆర్టీజీఎస్ అధికారులు వారికి సూచించారు. మళ్లీ ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉందనే హెచ్చరికలు ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని వారికి సూచించారు. తామందరం క్షేమంగానే ఉన్నామని..తమను సంప్రదించి యోగక్షేమాలు తెలు సుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కాగా ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు.




## నిశ్చితార్థ వేడుకలకు లోకేష్

ఏపీ రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కమిషనర్, ఐజీ భట్టు అంబేద్కర్ కుమార్తె నిశ్చితార్థ వేడుకలు మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగాయి. మంత్రి నారా లోకేష్‌తో పాటు ఎంపీ శ్రీభరత్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు. కాబోయే వధూవరులు జెహోరిక, రాహుల్ దీప్‌లను ఆశీర్వదించారు. పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.




## హ్యాపీ రక్షా బంధన్

రాఖీ పండుగను పురస్కరించుకుని మంగళగిరికి చెందిన పలువురు మహిళలు, స్థానిక టీడీపీ మహిళా నేతలు మంత్రి నారా లోకేష్‌కు రాఖీలు కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. గురువారం మంగళగిరి మోడరన్ రైతుబజార్ నిర్మాణ పనుల శంకు స్థాపనకు వచ్చిన సందర్భంగా వారంతా లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.










# అమరావతికి మరో జాతీయ విద్యాసంస్థ

- ఎన్ఐఈఎల్ఐటీ నేతృత్వంలో రూ.730 కోట్లతో
- దేశంలోనే తొలి క్వాంటమ్-ఏఐ యూనివర్శిటీ
- వచ్చే నెల 13 నుంచి ఏఎన్‌యూలో తరగతులు
- 8.5 ఎకరాల్లో క్యాంపస్ ఏర్పాటుకు సీఆర్డీఏ ఆమోదం




అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిని అత్యున్నత సాంకేతికత, ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రీకృ తమైన జాతీయ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ ఐటీ) డీమ్డ్ టూ బీ యూనివర్శిటీ ఆధ్వర్యంలో దేశం లోనే తొలిసారిగా క్వాంటమ్‌అండ్ ఏఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు సీఆర్డీఏ సూత్రప్రాయ ఆమో దం తెలిపింది. అమరావతి రాజధాని ప్రాంతంలో కేటా యించిన 8.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.730.70కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం 100 శాతం గ్రాంట్-ఇన్-ఎయిడ్ ఫండ్‌లో సమకూర్చనుంది. సచివాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసు కున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియ ల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, ఇతర అధునాతన డీప్-టెక్ రంగాలలో విద్యా బోధన, ఉపాధి శిక్షణ, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ఒకే వేదిక మీదకు తీసుకు రానున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న ఏకైక విశ్వవిద్యాలయమైన నైలిట్ పంజాబ్‌లోని రోపర్ లో ప్రధాన క్యాంపస్, దేశవ్యాప్తంగా 56 కేంద్రాలు, 11 రాజ్యాంగ విభాగాలు, 700కు పైగా గుర్తింపు పొందిన సంస్థల నెట్‌వర్క్‌తో పనిచేస్తున్న నైలిట్, అమరావతి వేదికగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తన డీప్-టెక్ క్యాంపస్‌ను విస్తరిస్తోంది.

### సెప్టెంబరు నుంచే క్లాసులు

అమరావతిలో శాశ్వత ప్రాంగణ నిర్మాణం పూర్తయ్యేంత వరకు ఆగకుండా వచ్చే నెల నుంచే విద్యార్థులు, వృత్తినిపుణులకు కోర్సులను అందుబాటులోకి తేనున్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసే తాత్కాలిక వసతిలో విద్యా బోధన, అధునాతన సాంకేతిక శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి. ఈ క్యాంపస్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్-సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూ టింగ్ హెచ్‌పీసీ వంటి కీలక రంగాల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ, డిప్లొమా, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేయనున్నారు. అమరావతి క్యాంపస్‌కు ప్రధాన ఆకర్షణగా 1.25 లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో క్వాంటమ్ రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ బ్లాక్'(క్యూఆర్ఐఐబీ)ను నిర్మించ నున్నారు. ఇందులో క్వాంటమ్ ఫోటోనిక్స్, క్రియోజెనిక్ సిస్టమ్స్, క్లీన్‌రూమ్- నానో-ఫ్యాబ్రికేషన్, డేటా సెంటర్లు, స్టార్టప్ కో-వర్కింగ్ స్పేస్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అండ్ పేటెంట్ సెల్ కొలువుదీరనున్నాయి. విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, పారిశ్రామిక వేత్తలు కలిసి సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలను వాణిజ్య స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి.

### ఐదేళ్లలో 8,250 మందికి శిక్షణ

ఈ ప్రాజెక్టు ద్వారా ఐదేళ్ల కాలంలో మొత్తం 8,250 మంది లబ్ధి పొందనున్నారు. 1,650 మంది డిగ్రీ-పీజీ కోర్సులు, 6,600 మంది విద్యార్థులు నైపుణ్య సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ల ద్వారా శిక్షణ పొందుతారు. అమరావతిలో నిర్మించే శాశ్వత ప్రాంగణాన్ని పర్యావరణహితంగా, సౌర విద్యుత్, ఈవీ ఛార్జింగ్, నెట్ జీరో లక్ష్యంతో నిర్మిస్తున్నారు. క్యాంపస్‌లో 500 మందికి వసతి కల్పిం చే హాస్టళ్లు, ఆడిటోరియం, క్రీడా ప్రాంగణాలు, విజిటింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ హౌస్‌లు నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషన ల్ క్వాంటమ్ మిషన్, ఇండియా ఏఐ మిషన్, ఇండియా సెమీ కండక్టర్ మిషన్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా ఆశయాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు కోసం ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్రా యూనివర్సిటీ, జేఎన్టీయూలతో నైలిట్ భాగస్వామ్యం కానుంది. ఈ అంతర్జాతీయ స్థాయి సంస్థ రాకతో అమరావతి సరికొత్త డీప్-టెక్ హబ్‌గా మారి రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

### పంచదార్ల కొండ నో మైనింగ్ జోన్

## గ్రావెల్ క్వారీ లీజు రద్దు చేసిన ప్రభుత్వం



అమరావతి(చైతన్యరథం): అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం పంచదార్ల కొండల్లో గ్రావెల్ క్వారీ లీజుపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొండలపై మైనింగ్ లీజును పూర్తి గా రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విజయ్‌కుమార్ నాయుడు దాసమన్నికి ఇచ్చిన 2.153 హెక్టార్ల క్వారీ లీజు రద్దుకు అనుమతి ఇచ్చింది. 14.05.2036 వరకు ఈ క్వారీ లీజు అమలులో ఉందని..కానీ ప్రజా ప్రయో జనాల దృష్ట్యా దీనిని రద్దు చేస్తున్నట్టు జారీచేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. పంచదార్ల కొండలపై మైనింగ్ కార్యకలాపాలకు ఇక అనుమతిలేదని ఏపీ ప్రభుత్వం స్పష్టంచేసింది. రాంబిల్లి మండలం పంచదార్ల పుణ్యక్షేత్ర కొండ లను ఇకపై నో మైనింగ్ జోన్‌గా ప్రక టించింది. గనుల తవ్వకాలతో పంచ దార్ల ప్రాంత పర్యావరణ, పురావస్తు, జల వనరులు, ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు ముప్పు ఉందని ప్రభుత్వానికి అధికారు లు నివేదిక అందజేశారు. మైనింగ్‌పై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పలు శాఖల అధికారులతో సంయుక్తంగా ఈ కొండలపై తనిఖీలు నిర్వహించారు. 6వ జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సిఫా ర్సుల మేరకు కూటమి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. పర్యావర ణం, భూగర్భ జలాలు, పురావస్తు, మతప రమైన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలో వివరించింది. ఇకపై పంచదార్ల కొండ ల్లో ఎలాంటి మైనింగ్ అనుమతులు ఇవ్వొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. తదుపరి చర్యలు చేపట్టాలని మైన్స్ అండ్ జియాలజీ శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



## విశాఖలో లోకేష్‌కు ఘనస్వాగతం

### ఎమ్మెల్యే కుమార్తె వివాహానికి హాజరు



విశాఖపట్నం(చైతన్యరథం): వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు గురువారం రాత్రి విశాఖకు వచ్చిన మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విశాఖ ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుమార్తె వివాహ వేడుకలకు హాజరయ్యారు. నూతన వధూవరులు అస్మిత నాయుడు, పవన్ మౌళీలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలిపారు.








## నిర్వాసితుల త్యాగం లేకుండా..

**కరవు నేలకు**
**కృష్ణమ్మ పరుగులు**

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర
- వెలిగొండ జలకళకు శ్రీకారం
- సాగు, తాగునీటికి శాశ్వత భరోసా
- ఆగస్టు 31న వెలిగొండ తొలిదశ ప్రారంభం
- 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు
- 15.25 లక్షలమందికి తాగునీరు

కౌంట్ డౌన్ 4


# వెలిగొండ కథ లేదు!

- 6,206 కుటుంబాలు.. రూ.768 కోట్లు..
- 48 రోజుల్లో మూడు విడతలుగా పరిహారం చెల్లింపు
- ప్రాజెక్టు వెనుక నిశ్శబ్ద త్యాగాల కథ

నల్లమలసాగర్ రిజర్వాయర్, సొరంగాల నిర్మాణం కోసం 11 గ్రామాలకు చెందిన వేలాది కుటుంబాలు తమ భూములు, ఇళ్లు వదులుకోవాల్సి వచ్చింది. ప్రాజెక్టు కోసం భూమి ఇవ్వడం అంటే కేవలం ఒక ఆస్తిని కోల్పోవడం కాదు. ఒక కుటుంబానికి అది జీవనాధారం. ఒక రైతుకు అది తరతరాలుగా వచ్చిన భూమి. ఒక గ్రామానికి అది తన అస్తిత్వం. అందుకే నిర్వాసితులకు న్యాయం చేయడం ప్రాజెక్టు నిర్మాణంలో ఒక భాగం మాత్రమే కాదు.. ప్రభుత్వ బాధ్యత కూడా. అయితే ఇంత కీలకమైన అంశం గతంలో సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోయింది.

### గతంలో ఆగిపోయిన ప్రక్రియ

వెలిగొండ నిర్వాసితుల పరిహారం, పునరావాసానికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు జారీ అయినప్పటికీ, నిధుల విడుదల జరగక ప్రక్రియ ముందుకు సాగలేదని అప్పటి నివేదికలు పేర్కొన్నాయి. 2021లో పరిహారం, పునరావాసం కోసం చర్యలు ప్రారంభించినప్పటికీ, నిధుల కొరత కారణంగా వ్యవహారం ఆచరణలో నిలిచిపోయింది. ప్రాజెక్టు పనులూ సాగక.. భూములిచ్చిన కుటుంబాలకు పరిహారం చెల్లించకపోవడం నిర్వాసితుల్లో అసంతృప్తికి కారణమైంది. ఒకవైపు ప్రాజెక్టు పూర్తి కావాలని ప్రజలు కోరుతుంటే.. మరోవైపు తమ భూములిచ్చిన కుటుంబాలు న్యాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాన్ని ప్రాజెక్టు పూర్తి చేయడంలో కీలక భాగంగా పరిగణించింది. ప్రాజెక్టు ప్రారంభించే ముందు నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలన్న దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు సమీకరించి పరిహారం చెల్లింపును వేగవంతం చేసింది. 2026 జూన్‌లోనే నిర్వాసితుల పరిహారం కోసం రూ.905 కోట్లకు పైగా అదనపు బడ్జెట్ కేటాయింపు చేసినట్టు అధికారికంగా వెల్లడైంది.



***వెలిగొండ.. మూడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం, నెల్లూరు, కడప ప్రాంతాల ప్రజలుఎదురుచూస్తున్న జల స్వప్నం. కరువుతో పోరాడుతున్న నేలకు కృష్ణా జలాలను తీసుకురావాలన్న ఈ మహా సంకల్పం ఇప్పుడు సాకారం కాబోతోంది. ఆగస్టు 31న ప్రాజెక్టు తొలి దశ ప్రారంభం కానుంది. నల్లమలసాగర్‌లోకి కృష్ణా జలాలు చేరనున్నాయి. లక్షలాది మంది రైతులు, ప్రజలు సంబరాలకు సిద్ధమవుతున్నారు. కానీ ఈ జల సంబరాల వెనుక మరో కథ ఉంది. అది కనిపించని త్యాగాల కథ. తమ ఇళ్లు, భూములు, పూర్వీకుల జ్ఞాపకాలు, తరతరాలుగా నివసించిన గ్రామాలను వదులుకున్న వేలాది నిర్వాసిత కుటుంబాల కథ. వారి త్యాగం లేకుంటే వెలిగొండ జల స్వప్నం ఇంత దూరం వచ్చేది కాదు. నిర్వాసితుల త్యాగాల కథ లేకుంటే వెలిగొండ చరిత్ర వెలితిగా ఉన్నట్టే!***

### 48 రోజుల్లో రూ.768 కోట్లు

ఇక్కడే చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడి ఉన్నప్పటికీ, ప్రాజెక్టు ప్రారంభోత్సవం కోసం వేచి చూడకుండా.. నిర్వాసితులకు ముందుగా న్యాయం చేయాలన్న నిర్ణయంతో పరిహారం చెల్లింపులను వేగవంతం చేసింది. కేవలం 48 రోజుల వ్యవధిలో మూడు విడతలుగా రూ.768 కోట్లను 6,206 కుటుంబాలకు అందించడం దీనికి నిదర్శనం. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు అందాయి. రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు చెల్లించారు. ఆగస్టు 22న మూడో విడతగా మరో 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 కుటుంబాలకు రూ.768 కోట్లు అందాయి. ఈ చెల్లింపులతో ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియలో దాదాపు 85 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ వేగం సాధారణ విషయం కాదు. భారీ ప్రాజెక్టుల్లో భూసేకరణ, పరిహారం, పునరావాస ప్రక్రియలు సాధారణంగా సంవత్సరాల తరబడి సాగుతుంటాయి. ఒక్కో కుటుంబానికి సంబంధించిన రికార్డుల పరిశీలన, అర్హత నిర్ధారణ, ప్యాకేజీల ఖరారు, నిధుల విడుదల వంటి అనేక దశలు ఉంటాయి. వెలిగొండ విషయంలో ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి లబ్ధిదారుల వివరాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

### ప్రాజెక్టు ముందు.. నిర్వాసితులకు న్యాయం

ఆగస్టు 22న రూ.250 కోట్ల మూడో విడత పరిహారం చెక్కును అందజేసిన వేదికపైనే ఆగస్టు 31న వెలిగొండ తొలి దశను ప్రారంభిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించడం కూడా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. అంటే.. ప్రాజెక్టు ఫలితాలను ప్రజలకు అందించే ముందు, ఆ ప్రాజెక్టు కోసం తమ ఆస్తులను త్యాగం చేసిన కుటుంబాల సమస్యను పరిష్కరించాలన్న ప్రభుత్వ ప్రాధాన్యత ఇందులో కనిపిస్తోంది.

నిధుల కొరతను సాకుగా చూపి పరిహారాన్ని వాయిదా వేయడం సులభం. కానీ నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అందుకు భిన్నంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడి ఉన్నప్పటికీ, కీలక ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు వాటి కోసం త్యాగం చేసిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిందేనన్న వైఖరితో ముందుకు సాగింది. ఒకవైపు ప్రాజెక్టు పనులు.. మరోవైపు పరిహారం.. రెండింటినీ సమాంతరంగా నడిపించడమే ఈ వేగానికి కారణమైంది. ఇంకా చెల్లించాల్సిన కుటుంబాలకు కూడా త్వరలో పరిహారం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోంది. మొత్తం ప్రభావిత కుటుంబాల సంఖ్య 7,321గా ఉండగా, ఇప్పటివరకు 6,206 కుటుంబాలకు రూ.768 కోట్లు అందాయి. మిగిలిన పరిహారాన్ని కూడా త్వరగా చెల్లించేందుకు చర్యలు కొనసాగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.


### పరిహారం మాత్రమే కాదు.. పునరావాసమే ముఖ్యం

నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతో ప్రభుత్వం బాధ్యత పూర్తయినట్టు భావించకూడదు. డబ్బు ఒక కుటుంబానికి తక్షణ భరోసా ఇవ్వొచ్చు. కానీ ఒక గ్రామాన్ని, జీవన విధానాన్ని కోల్పోయిన కుటుంబానికి శాశ్వతంగా నిలబడేలా పునరావాసం కల్పించడమే అసలు లక్ష్యం కావాలి. నిర్వాసిత కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, పాఠశాలలు, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు వంటి మౌలిక వసతులు సమగ్రంగా అందాలి. ఈ నేపథ్యంలో మార్కాపురం ప్రాంతంలోని ప్రతి ఇంటికీ జల్ జీవన్ మిషన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించడం ప్రాధాన్యమైన అంశం. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన ప్రజలు కూడా భవిష్యత్తులో ఈ జలవనరుల ప్రయోజనాలను అనుభవించేలా చూడాలి. అప్పుడే 'త్యాగం చేసినవారికి న్యాయం' అనే మాటకు పూర్తి అర్థం వస్తుంది.

### జల స్వప్నం వెనుక.. త్యాగాల చరిత్ర

ఆగస్టు 31న వెలిగొండ తొలి దశ ప్రారంభమై నల్లమలసాగర్‌లోకి కృష్ణా జలాలు చేరినప్పుడు.. అది కేవలం ఒక ప్రాజెక్టు ప్రారంభం కాదు. మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు. కరువుతో పోరాడిన ప్రజల ఆశలకు సమాధానం. రైతుల భవిష్యత్తుకు కొత్త భరోసా. కానీ ఆ నీటిలో తమ భూములను కలిపిన నిర్వాసిత కుటుంబాల త్యాగం కూడా ఉంటుంది. ప్రాజెక్టులు కేవలం కాంక్రీట్, సొరంగాలు, రిజర్వాయర్లు, కాలువలతో నిర్మించబడవు. వాటి వెనుక ప్రజల విశ్వాసం, రైతుల భూములు, నిర్వాసితుల త్యాగాలు ఉంటాయి. వెలిగొండ విషయంలో ఆ త్యాగాన్ని గుర్తించడం.. పరిహారాన్ని న్యాయంగా అందించడం.. పునరావాసాన్ని గౌరవప్రదంగా పూర్తి చేయడం ప్రభుత్వానికి ఉన్న బాధ్యత. వెలిగొండ చరిత్రను రేపటి తరాలు చదివినప్పుడు.. ఇది కేవలం ఇంజినీరింగ్ అద్భుతం అని మాత్రమే చెప్పకూడదు. 'ఒక ప్రాంతం దాహాన్ని తీర్చేందుకు కొందరు తమ ఇళ్లు, భూములు వదులుకున్నారు.. వారి త్యాగానికి న్యాయం చేస్తూనే ఆ జల స్వప్నాన్ని సాకారం చేశారు' అని కూడా చెప్పాలి. ఎందుకంటే నల్లమలసాగర్‌లోకి చేరే ప్రతి నీటి బొట్టులో.. నిర్వాసితుల త్యాగం కూడా భాగమే.

***(రేపటి కథనంలో: వెలిగొండ జలాలతో లబ్ధి పొందనున్న మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల వివరాలు. ఏ ప్రాంతానికి ఎంత ప్రయోజనం చేకూరనుంది?)***



# ఎల్‌నినో కాదు..
# రాష్ట్రానికి అతి పెద్ద విపత్తు జగనే

- పోలవరం పూర్తిచేసి ఉంటే ఎల్‌నినో ఇబ్బంది ఉండేది కాదు
- పనికిమాలిన రాజకీయ పార్టీ 'గొడ్డలి పార్టీ'
- జగన్ నోరు విప్పితే అబద్ధమే.. కూటమిపై బురదజల్లడమే ఆయన పని
- గతంలో ఇరిగేషన్‌పై రూ.64 వేల కోట్లు ఖర్చు చేశాం
- ఈ రెండేళ్లలో రూ.13,500 కోట్లతో రాయలసీమ ప్రాజెక్టులను గాడిలో పెట్టాం
- గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రారంభించే దిశగా అడుగులు
- వచ్చే నెల 3న ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- రైతులపై ప్రేమ ఉంటే జగన్ అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలి
- బీసీల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన ద్రోహి జగన్
- రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాల రహితంగా మార్చడమే లక్ష్యం
- మత్స్యకారుల భద్రతకు ప్రత్యేక ఎస్‌ఓపీ సిద్ధం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



విశాఖపట్నం (చైతన్యరథం): ప్రకృతి విపత్తుల కంటే రాష్ట్రానికి అతి పెద్ద విపత్తు జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన గొడ్డలి పార్టీనేనని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఒక పనికిమాలిన రాజకీయ పార్టీ ఉందని, అదే గొడ్డలి పార్టీ అని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ నేతలు చెప్పే ప్రతి మాట అబద్ధమేనన్నారు. ఏమరుపాటుగా 2019 నాటి ఫలితాలు మరోసారి పునరావృతమైతే నష్టం చంద్రబాబుకో, టీడీపీకో కాదని రాష్ట్రానికే కోలుకోలేని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బెంగళూరు నుంచి వచ్చి ప్రెస్‌మీట్లు పెట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. జగన్ చెప్పే మాటలను కొంతమందైనా నమ్మితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే ఉద్దేశంతోనే ప్రజలను వాస్తవాలతో చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. ఐదేళ్ల తన పాలనలో చేసిన తప్పులను గుర్తుపెట్టుకోకుండా జగన్ మాట్లాడటం బాధాకరమన్నారు.

**వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకే రిజర్వాయర్లు**

వర్షాభావ పరిస్థితులు ఐదు, ఆరు సంవత్సరాలకు ఒకసారి వస్తుంటాయని, అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకే రిజర్వాయర్లు నిర్మిస్తారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఒక్క ఇరిగేషన్ రంగంపైనే రూ.64 వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను గాడిలో పెట్టిందన్నారు. మరో రెండు సంవత్సరాల్లో కొన్ని ప్రాజెక్టులు పూర్తయ్యే పరిస్థితి ఉన్న సమయంలో జగన్ అధికారంలోకి వచ్చారని, ఆయన ప్రభుత్వం ఒక్క జీవోతో ప్రాజెక్టులను నిలిపివేసిందని విమర్శించారు. రాయలసీమకు జగన్ చేసినంత ద్రోహం ఏ ముఖ్యమంత్రీ చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండున్నర సంవత్సరాల్లో రూ.13,500 కోట్లు ఖర్చు చేసి రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులను గాడిలో పెట్టామని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను నాశనం చేసిన జగన్ ఇప్పుడు ఎల్‌నినో గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

**పోలవరం పూర్తి చేసి ఉంటే..**

జగన్ తన పాలనలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే ఎన్ని ఎల్‌నినోలు వచ్చినా రైతులకు ఇబ్బంది ఉండేది కాదని అచ్చెన్నాయుడు అన్నారు. కానీ జగన్ పోలవరాన్ని గోదావరిలో కలిపేశారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును ప్రారంభించుకోబోతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టును ఈ నెలాఖరుకు ప్రారంభిస్తున్నారని, వచ్చే నెల 3వ తేదీన ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకువస్తున్నారని వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉందని చెప్పారు. రైతులను ముందుగానే అప్రమత్తం చేసి, ఏయే పంటలు వేయాలనే అంశంపై అవగాహన కల్పించామని తెలిపారు. పంటలు, వ్యవసాయం గురించి జగన్‌కు ఏం తెలుసని ప్రశ్నించారు. గతంలో రైతులను పరామర్శించడానికి వెళ్లినప్పుడు కూడా సినిమా సెట్టింగులు, డ్రోన్లు, రెడ్ కార్పెట్ల మధ్య జగన్ కార్యక్రమాలు నిర్వహించారని ఎద్దేవా చేశారు. జగన్‌కు రైతులపై నిజంగా ప్రేమ ఉంటే శాసనసభకు రావాలి. అసెంబ్లీలో జరిగే చర్చల్లో పాల్గొని రైతుల సమస్యలపై మాట్లాడాలని సవాల్ చేశారు.

**పంటల బీమా పేరుతో నట్టేట ముంచారు**

వైసీపీ ప్రభుత్వం పంటల బీమా పేరుతో రైతులను నట్టేట ముంచిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. అసెంబ్లీలో చంద్రబాబు పోడియం ముందు కూర్చుంటే ఒక్క సంవత్సరం మాత్రమే బీమా కట్టారన్నారు. వైసీపీ పాలకులు చేసిన మోసాలతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. జగన్ తన పాలనలో ఒక్క సంవత్సరమైనా రబీకి బీమా కట్టారా అని ప్రశ్నించారు. 2023లో కరువు మండలాలను ప్రకటించిన జగన్ ప్రభుత్వం రైతులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. అదే బుడమేరు విపత్తు వచ్చినప్పుడు కూటమి ప్రభుత్వం వెనువెంటనే స్పందించి బాధితులకు పరిహారం అందించిందని తెలిపారు.

**బలహీన వర్గాలపై వైసీపీది కక్షపూరిత వైఖరి**

రాజశేఖర్‌రెడ్డి, జగన్‌కు బలహీన వర్గాలంటే చిన్నచూపు అని అచ్చెన్నాయుడు విమర్శించారు. బలహీన వర్గాలు టీడీపీతో ఉంటున్నాయనే కారణంతో వారిపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో బలహీన వర్గాలపై దమనకాండకు దిగారని, నలుగురు సామంత రాజులకు రాష్ట్రాన్ని అప్పగించారని విమర్శించారు. జగన్ బీసీలకు ఏం చేశారు? ఆయన మాయమాటలను ప్రజలు ఇక నమ్మబోరన్నారు. చంద్రబాబు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో ఉన్నవారు కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. తాను బీసీ మంత్రిగా పనిచేసిన సమయంలో బీసీల సంక్షేమంలో చరిత్ర సృష్టించామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గతంలో బీసీలకు అందించేందుకు పరికరాలను కొనుగోలు చేసి సిద్ధం చేస్తే, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని లబ్ధిదారులకు పంచకుండా గోదాములకే పరిమితం చేశారని విమర్శించారు.

**24 శాతానికి తగ్గించింది జగన్ కాదా?**

జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని, బీసీలు రాజ్యాధికారంలో భాగస్వాములు కాకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. జగన్ చేసిన మోసం వల్ల బీసీలు అనేక అవకాశాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కూడా జగన్ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ పార్టీ నుంచి బీసీలకు 34 శాతం కంటే ఒక శాతం ఎక్కువ సీట్లు ఇవ్వడానికి కూడా మేము సిద్ధంగా ఉన్నామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ మా లక్ష్యం**

వైసీపీ ప్రభుత్వంలో గంజాయికి సహకరించిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని మంత్రి ఆరోపించారు. ఆ ఐదేళ్లలో రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగితే తామే గెలుస్తామని జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాల అభ్యర్థులను భయపెట్టి ఏకగ్రీవాలు చేసుకున్న విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రానికి స్వర్ణయుగమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్ ముద్దులు పెట్టి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. జగన్ నోరు విప్పితే అబద్ధమే వస్తుందని మండిపడ్డారు. గతంలో తమ పార్టీకి సభలో ఒక్క సభ్యుడు ఉన్న సమయంలోనూ సభను గడగడలాడించామని గుర్తుచేశారు. తమను ఎంతో అవమానించినా చివరి వరకు ప్రజా సమస్యలపై పోరాటం చేశామని చెప్పారు. జగన్ అసెంబ్లీకి వస్తే ఐదు సంవత్సరాల్లో చేసినదంతా బయటపెట్టి బట్టలు విప్పుతామని హెచ్చరించారు.

**టీడీపీకి అన్ని మతాలపై గౌరవం**

మతం మారాలని ఇబ్బందులు పెట్టారంటూ వైసీపీ నేత జోగి రమేష్ కోడలు బయటకు వచ్చి మాట్లాడితే దానిని కూడా చంద్రబాబుపై నెట్టడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీకి అన్ని మతాలపైనా గౌరవం ఉందని స్పష్టం చేశారు. జగన్ లాంటి మనుషులను ఎక్కడా చూడలేమని వ్యాఖ్యానించారు. పెరుగుతున్న ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అచ్చెన్నాయుడు తెలిపారు. వైసీపీ నాయకుడు కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు చేసిన తప్పులు రికార్డెడ్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. తప్పు చేసిన వారిని వదిలేయాలా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో రాజకీయ కక్షలకు తావులేదని, అయితే తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. చట్ట ప్రకారమే చర్యలు ఉంటాయన్నారు. పదవులు ముఖ్యం కాదు.. స్వేచ్ఛ ముఖ్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర మాకు స్వేచ్ఛ ఉంది, విలువ ఉంది. నిజంగా రెడ్ బుక్ పనిచేస్తే ఒక్కరైనా మిగులుతారా అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

**ఒడలరేవు బోటు ఘటనపై వేగంగా స్పందించాం**

ఒడలరేవు బోటు ఘటనపై ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందని మంత్రి తెలిపారు. ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా తిరిగి వస్తున్నారని చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక ఎస్‌ఓపీ సిద్ధం చేశామని, ఇకపై వేటకు వెళ్లే సమయంలో నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎన్టీఆర్ వైద్య సేవ ఛైర్మన్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సీతంరాజు సుధాకర్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోరాడ రాజబాబు, అనసూరి మధు, విల్లూరి భాస్కరరావు, వలిశెట్టి తాతాజీ, నక్క కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# 32వ రోజూ విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం

- 2,23,618 ఇళ్లను సందర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- మొత్తంగా 88.47లక్షల ఇళ్లకు చేరిక
- ప్రజా భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా కొనసాగుతున్న వైనం

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు... ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 32వ రోజు గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. 32 వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 2,23,618 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 88.47లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించాయి. ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసి... వారికి అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తూ రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా కుటుంబాలకు తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యమవుతున్నారు.



## రెండేళ్లుగా బెంగళూరులో సేద తీరుతున్న...

# జగన్ రెడ్డికి ఇప్పుడు ఎల్ నినో గుర్తుకొచ్చిందా?

- **రైతులను ముందే అప్రమత్తం చేసిన కూటమి ప్రభుత్వం**
- **బీసీలపై గొడ్డలి పార్టీ అధినేత మొసలి కన్నీరు**
- **నాడు రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో ఎందుకు పోరాడలేదు**
- **సొంత జిల్లాకే ఏం చేయని జగన్.. రాయలసీమ ప్రాజెక్టులు తానే చేశానని చెప్పుకోవడం సిగ్గు చేటు**
- **మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం**

అమరావతి (చైతన్యరథం): ప్రజా సమస్యలపై జగన్మోహన్ రెడ్డికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి గానీ.. సొంత మీడియా ముందు మాట్లాడటం సరికాదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి విమర్శించారు. ఇన్ని రోజులు బెంగళూరులో సేద తీరిన జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు హటాత్తుగా ఎల్ నినో గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. నిజంగా ఎల్ నినో నివారణ, రైతు సమస్యలపై జగన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే శాసన మండలిలో తన ఎమ్మెల్సీలతో చర్చకు ఎందుకు సిద్ధపడలేదని ప్రశ్నించారు. విలువైన శాసన మండలి సమావేశం డిప్యూటీ చైర్మన్‌ను పొగడడానికే వైసీపీ ఎమ్మెల్సీలు సరిపెట్టారని విమర్శించారు. అధికారంలో ఉండగా బలహీన వర్గాలను చెరపట్టి ఇప్పుడు వాళ్లపై మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ సాక్షిగా బలహీన వర్గాలకు నామినేటెడ్ కాంట్రాక్టుల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని మాట ఇచ్చిన జగన్.. ఒక్క శాతం కూడా ఇవ్వకుండా బీసీలను నిలువునా మోసగించాడని మంత్రి గుర్తు చేశారు.

**ఎల్ నినోపై అప్రమత్తంగా ప్రభుత్వం**

ఐదేళ్ల కాలంలో ఒక్క కరువు నివారణ చర్య చేపట్టని బలహీన ముఖ్యమంత్రి జగన్ రెడ్డి. ఇన్ని రోజులు బెంగళూరులో ఉన్న జగన్మోహన్ రెడ్డికి ఎల్ నినో గురించి తెలియక పోవచ్చు. ఇప్పుడు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం ముందు నుంచే చర్యలు ప్రారంభించింది. మంత్రులు, కలెక్టర్లు, ఇతర అధికారులకు ముందు నుంచే సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ రాబడి తీసుకొచ్చే వరి రకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వరి, మినుము, పత్తి వంటి పంటలకు తక్కువ డబ్బులతోనే ఇన్సూరెన్స్ చేయిస్తోంది. ఒకే అబద్ధాన్ని 100 సార్లు చెబితే నిజం అయిపోతుందని భ్రమలో జగన్ ఉన్నారు. ఐదేళ్ల పరిపాలనలో చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేక కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ అబద్ధాల్ని ప్రచారం చేస్తున్నారు. జగన్ చెప్పే అబద్దాలను నమ్మే పరిస్థితుల్లో ఇవాళ రాష్ట్ర ప్రజలు లేరు. ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన



నిజంగా జగన్ రెడ్డికి ఉంటే అసెంబ్లీకి రావాలి. రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకి చేసిన గొడ్డలి వేటు, విధ్వంసం బయటపడుతుందని జగన్ అసెంబ్లీకి రావడం లేదని మంత్రి పార్థసారథి విమర్శించారు.

**శాసనమండలిలో ఎల్ ని నోపై ఎందుకు చర్చించలేదు**

రైతులపై మొసలి కన్నీరు కార్చుతున్న జగన్ ఎల్ నినోపై శాసన మండలిలో వాళ్ల ఎమ్మెల్సీలతో ఎందుకు చర్చకు రాలేదు. విలువైన శాసనమండలి సమయాన్ని డిప్యూటీ చైర్మన్‌ను పొగడడానికే సరిపెట్టారు. నాలుగు గంటలు ఏకధాటిగా కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ డిప్యూటీ చైర్మన్ ను పొగడానికి ఉపయోగించారు. పత్రికా ప్రకటనల ద్వారా సానుభూతి ప్రకటిస్తే సమస్యలు పరిష్కారం కావు. జగన్ ఇది వరకు ఆవు కథ ఒక్కటే చెప్పేవారు. ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు. రాష్ట్రానికి ప్రాణంగా భావించే పోలవరం పనులను ఐదేళ్ల పాలనలో జగన్ అటకెక్కించాడు. కేవలం 5శాతం పనులు మాత్రమే చేసి ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. నేడు పోలవరం పనులు దాదాపుగా పూర్తి చేసాం. సెప్టెంబర్ 3వ తేదీ నాటికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకొస్తున్నాం. చింతలపూడి ప్రాజెక్ట్ కోసం చంద్రబాబు నాయుడు రూ. 4వేల కోట్లు ఖర్చు చేశారు. కృష్ణా నది జలాలు ఇవ్వకుండా రైతాంగాన్ని మోసం చేస్తున్నారని వైసీపీ నాయకులు అంటున్నారు. మరోపక్క తెలంగాణలో కృష్ణా నీళ్లు ఆంధ్ర ప్రజలు దోచుకుంటున్నారని ప్రచారం చేయిస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కాలువల ద్వారా రైతుల వరి నాట్లు కాపాడుకోవడానికి నీళ్లు వదిలితే అది కూడా జగన్మోహన్ రెడ్డి దృష్టిలో తప్పేనా అని మంత్రి ప్రశ్నించారు.

**నాడు అసెంబ్లీ సాక్షిగా బీసీలకు జగన్ మోసం**

బీసీలకు 44శాతం పార్లమెంట్ స్థానాలు, 40శాతం జిల్లా పరిషత్ స్థానాలు ఇచ్చానని పచ్చి అబద్దాలు చెప్పుకుంటున్న జగన్.. బీసీలకు 34శాతం రిజర్వేషన్లపై ఎందుకు అంత చిత్తశుద్ధి ప్రదర్శించలేదు. రిజర్వేషన్‌లను హైకోర్టు వ్యతిరేకిస్తే సుప్రీంకోర్టుకు వెళ్లి ఎందుకు పోరాడలేదు. జగన్ నిర్వాకంతో 16,800 మంది బలహీన వర్గాల వారికి పదవులు లేకుండా పోయాయి. బీసీలకు మొదటి నుంచి మేలు చేకూర్చిన పార్టీ తెలుగుదేశం. నాడు 1995లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రత్యేక చట్టం చేసి బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఆ చట్టం ప్రకారమే 2019 ఎన్నికల వరకు బీసీలకు ఈ రిజర్వేషన్లు ఉపయోగపడ్డాయి. శాసనసభ సాక్షిగా బలహీన వర్గాలకు నామినేటెడ్ కాంట్రాక్ట్‌లో లేదా ప్రభుత్వం చేసే వ్యాపారాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని మాట ఇచ్చి మాట తప్పిన వ్యక్తి జగన్. నేతి బీరకాయలో నెయ్యి లేనిది ఎంత నిజమే జగన్ మాటలు కూడా అంతే. బీసీలపై అంత ప్రేమ ఉంటే యూనివర్సిటీల్లో ఒక్కరికైనా వెనుకబడిన వర్గాల వారికి వైఎస్ చాన్సలర్ పదవి ఇచ్చావా జగన్? అధికారంలో ఉండగా బీసీల భూములు కొట్టేశారు. అనేక మందిని నరికి చంపారు. నేడు బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని మంత్రి మండిపడ్డారు.

**రాయలసీమ రైతాంగానికి జగన్ చేసింది శూన్యం**

రాయలసీమ ప్రాజెక్టులకు ఐదేళ్ల పాలనలో జగన్ ఖర్చు పెట్టింది కేవలం రూ. 2000 కోట్లు మాత్రమే అంటే 100 రూపాయలకి 1.60 పైసలు మాత్రమే. నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమ సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు రెండేళ్లలో రూ.13,500 కోట్లు ఖర్చు పెట్టి మరో 10వేల కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉంది. సొంత జిల్లాలో ఉండే స్టీల్ ప్లాంట్ కు రెండు సార్లు కొబ్బరి కాయలు కొట్టిన జగన్ ఒక్క ఇటుక అయినా పేర్చారా? నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ స్టీల్ ప్లాంట్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్షల కోట్లతో అనేక ప్రాజెక్టులను నెలకొల్పుతున్నాం. గ్రీన్ ఎనర్జీలో అనేక పెట్టుబడులు వస్తున్నాయి. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్లు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి చెప్పారు.

**అరెస్టులపై తప్పుడు ప్రచారం**

మద్యం రవాణా కేసులో ఇప్పుడు అరెస్టు అవుతున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయించడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ అరెస్టు చేస్తోంది. వారికి సుప్రీంకోర్టు సైతం ముందస్తు బెయిల్ నిరాకరించిన తరువాతే ఈ అరెస్టులు జరుగుతున్నాయి. వాస్తవాలు ఇలా ఉంటే వాళ్లపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి అరెస్టు చేయిస్తున్నట్లు జగన్మోహన్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని మంత్రి పార్థసారథి తప్పుబట్టారు.

## బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై పల్లా సంతాపం**




అమరావతి (చైతన్యరథం): పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పల్లా సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పల్లా భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

# కరువుతో జగన్ రాజకీయం

- **అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమకు తీరని ద్రోహం**
- **నేడు కపటప్రేమతో జగన్ మొసలి కన్నీరు**
- **ఐదేళ్లలో రాయలసీమకు రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన వైసీపీ ప్రభుత్వం**
- **జీఓ 365తో 102 రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు రద్దు చేసిన జగన్**
- **కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సీమ ప్రాజెక్టులకు రూ.13,500 కోట్లకు పైగా ఖర్చు**
- **హంద్రీనీవాకు రూ.5,050 కోట్లు వ్యయం**
- **ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు**



అమరావతి (చైతన్యరథం): ఎల్ నినో ప్రభావంతో రాయలసీమలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి వాడుకుంటున్నారని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాయలసీమ ప్రయోజనాలను ఏనాడూ పట్టించుకోని జగన్, ఇతర వైసీపీ నాయకులు ఇప్పుడు కరువును అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించిరు. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.13,500 కోట్లకు పైగా ఖర్చు పెట్టిందన్నారు. మరో రూ.10,014 కోట్లు ఈ బడ్జెట్ లో ఖర్చు చేస్తున్నాం. 2014-19 మధ్య మేము రూ.12,441 కోట్లు ఖర్చు చేశాం. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో పెట్టిన రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాయలసీమ ప్రాజెక్టులకు కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 365 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 198 ప్రాజెక్టులను ప్రీ-క్లోజర్ చేస్తే... అందులో 102 ప్రాజెక్టులు రాయలసీమలోనే ఉన్నాయి. హంద్రీనీవా విస్తరణ, వేదవతి, గుండ్రేవుల, హెచ్ఎల్‌సి కాలవ ఆధునీకరణ వంటి కీలక ప్రాజెక్టులను రద్దు చేయడం రాయలసీమకు జగన్ చేసిన ద్రోహం. హంద్రీనీవాకు ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో రూ.3,850 కోట్లు ఖర్చు పెట్టాం. ఈ ఏడాది మరో రూ.1,180 కోట్లు కేటాయించనున్నాం. జగన్ రద్దు చేసిన మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని 12 రాష్ట్రాలు, 315 జిల్లాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇది ప్రపంచవ్యాప్త సమస్య. అయితే దీనిని సీఎం చంద్రబాబుకు ఆపాదిస్తూ గొడ్డలి పార్టీ అధినేత తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాలవ దుయ్యబట్టారు.

**ఒకే అంశంపై భిన్న కథనాలు**

సాక్షి పత్రికలో 'తెలంగాణ నీళ్లు తోడేస్తుంటే బాబు మౌనం' అని రాస్తే, నమస్తే తెలంగాణలో 'కృష్ణా జలాల్లో ఏపీ దోపిడి' అని రాస్తున్నారు. ఒకే అంశంపై భిన్న కథనాలతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయం చేస్తున్నారు. కృష్ణా నదీ యజమాన్య బోర్డు నియమాల ప్రకారమే నీటి కేటాయింపులు జరుగుతున్నాయి. చంద్రబాబు నాయుడు సమర్థ నీటి నిర్వహణ వల్లనే గతేడాది నీటిని నిల్వ చేయటంతో ప్రస్తుతం కొంత వెసులుబాటు కలిగింది. 2027 జూలై వరకు తాగునీటి అవసరాలకు నీరు నిల్వ చేస్తున్నాం. కష్టకాలంలో రాజకీయాలు చేయకుండా రైతులకు, ప్రజలకు అండగా నిలవాలని కాలవ హితవు పలికారు.

# వైసీపీ నేత చెరలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు

- హద్దు రాళ్లు తొలగించి భూ ఆక్రమణకు యత్నం
- నకిలీ డీకేటీ పట్టాలతో బరితెగింపు, ట్రాక్టర్‌తో మామిడి తోట ధ్వంసం
- తండ్రి అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకుని దగా, రూ.60 లక్షల ఉమ్మడి ఆస్తిని కాజేసిన అన్నలు
- తెనాలిలో రియల్టర్ మోసం, నకిలీ రిజిస్ట్రేషన్లు.. ప్రైవేట్ ప్లాట్లు, పంట కాలువ స్వాహా
- న్యాయం చేయాలంటూ టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి టీజీ భరత్, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ





అమరావతి (చైతన్యరథం): వైసీపీ నాయకుడొకరు రెండు మండలాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారని తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం నర్సాకోట గ్రామానికి చెందిన మునిసుబ్బయ్య గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖల మంత్రి టీజీ భరత్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ.. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా మునిసుబ్బయ్య అర్జీ ఇస్తూ.. వైసీపీ బీఎన్ కండ్రిగ మండల మాజీ కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి బీఎన్ కండ్రిగ మండలంలో సుమారు 300 ఎకరాలు, వరదయ్యపాళెం మండలంలో మరో 200 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. చెరువులు, కుంటలు, అనాధీనం, పోరంబోకు భూములతో పాటు నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను అక్రమంగా చేజిక్కించుకున్నారు. వెబ్‌ల్యాండ్ రికార్డులను తారుమారు చేసి, వేల సంఖ్యలో నకిలీ ఆర్ఓఆర్ 1-బీ లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించారు. స్థానిక రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు గత పాలకుల ఒత్తిళ్లతో విద్యానాథరెడ్డికి పూర్తిగా సహకరించారు. కొందరు అధికారులు ఇప్పటికీ పాత పద్ధతిలోనే అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు. వారిపై చర్యలు తీసుకోని ప్రభుత్వం భూములను కాపాడాలని అభ్యర్థించారు.

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం పాటెంపాడు గ్రామానికి సీతారామయ్య అర్జీ ఇచ్చి..1977 జూలై 23న జరిగిన కుటుంబ ఒప్పందం ప్రకారం తన తండ్రి గుత్తా నరసింహారావుకి వాటాగా వచ్చిన 3.52 ఎకరాల భూమిని ఆయన 2014 అక్టోబర్ 10న రిజిస్ట్రేషన్ ద్వారా తన పేరున బదిలీ చేశారని తెలిపారు. అప్పటి నుంచి ఆ భూమి తమ స్వాధీనంలోనే ఉంది. ఇటీవల పక్క హద్దుదారుడైన గుత్తా శ్రీనివాసరావు ఉద్దేశపూర్వకంగా భూమి హద్దు రాళ్లను తొలగించి, రికార్డులను అడ్డుపెట్టుకుని ఎక్కువ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మార్వో, ఎస్ఐలకు ఫిర్యాదు చేసిన తనకు న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలం బెడుదూరు గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్లు 335, 336, 482/6లలో తను, కొత్తపల్లి గంగప్ప ఉమ్మడిగా వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. సుమారు రెండేకరాల విస్తీర్ణంలో మూడేళ్ల క్రితం నాటిన మామిడి చెట్లను, చుట్టూ వేసిన ఫెన్సింగ్ కంచెను, ఇనుప గేటును, సాగునీటి పైప్‌లైన్లను అదే గ్రామానికి చెందిన దంపెట్ల నారాయణస్వామి ట్రాక్టర్‌తో దున్ని పూర్తిగా నాశనం చేశారు. స్థానికంగా ఉన్న కొందరు రాజకీయ పెద్దల అండదండలతో దంపెట్ల నారాయణస్వామి ఈ భూములకు సంబంధించి నకిలీ డీకేటీ పట్టాలు సృష్టించి, భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. ఈ అకృత్యంపై ఇప్పటికే కడప జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ, స్థానిక పలుకుబడి కారణంగా నిందితుడిపై ఇప్పటివరకు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం పందిపల్లె గ్రామానికి చెందిన బొమ్మర చంద్రశేఖర్ విజ్ఞప్తి చేస్తూ..తమ కుటుంబంలో మొత్తం నలుగురు మగ సంతానం ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారు. వేపముల గ్రామ పరిధిలో తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన పూర్వీకుల భూములు ఉన్నాయి, నిబంధనల ప్రకారం నలుగురుకి ఆస్తి సమానంగా పంచాల్సి ఉంది. తనకు చదువు రాకపోవడం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మిగిలిన ముగ్గురు అన్నలైన బొమ్మర పరమయ్య, బొమ్మర నీలకంఠేశ్వరయ్య, బొమ్మర గోవిందరాజులు కుట్ర పన్నారు. తండ్రి అనారోగ్యంతో, సరైన స్పృహ లేని సమయంలో కర్నూలులో ఆయన పేరిట ఉన్న వ్యవసాయ భూములను ముగ్గురు అన్నలు తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నంద్యాల టౌన్‌లో ఉన్న ఉమ్మడి స్థలాన్ని సుమారు రూ. 60,80,000 (అరవై లక్షల ఎనభై వేల రూపాయలకు) అమ్ముకుని ఆ మొత్తాన్ని పూర్తిగా ఆ ముగ్గురు అన్నలే పంచుకున్నారు. తనకు నయాపైసా వాటా ఇవ్వకుండా మోసం చేశారు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పగడాల కాశయ్య విజ్ఞప్తి చేస్తూ..1987లో సర్వే నెం. 623/1లోని 70 సెంట్ల వెంచర్‌లో పఠాన్ హమీద్ ఖాన్, అహ్మద్ ఖాన్, షబ్బీర్ ఖాన్, మహబూబ్ ఖాన్‌ల నుంచి తాను 132.5 చ.గజాలు (దస్తావేజు నెం: 2392/1987), తన సోదరుడు దివంగత చిన కాశయ్య 142.5 చ.గజాలు (దస్తావేజు నెం: 2039/1987) కొనుగోలు చేశామని తెలిపారు. అయితే 2007 తర్వాత సదరు వ్యక్తులు బినామీలను అడ్డుపెట్టుకుని దొంగ రిజిస్ట్రేషన్లు సృష్టించి తమ స్థలాలను కబ్జా చేశారు. వెంచర్ నిర్వాహకులు తమ భూమినే కాకుండా, పక్కనే ఉన్న మరో ఎకరం భూమిని, జలవనరుల శాఖకు చెందిన పంట కాలువను సైతం ఆక్రమించి ప్లాట్లుగా విభజించి అక్రమంగా విక్రయించారు. గత 20 ఏళ్లుగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేసినప్పటికీ ఫలితం లేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ముత్యాలపాడుకు చెందిన పి. హనుమంతరెడ్డి విజ్ఞప్తి చేస్తూ..గతంలో రుద్రవరం తహశీల్దార్ తన భార్య పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని తెలిపారు. దీనిపై అప్పట్లోనే రుద్రవరం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. ఈ కేసు ప్రస్తుతం ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ దశలో ఉంది. ఈ కేసును కొట్టివేయాలని సదరు అధికారి 2019లో హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. అనంతరం 2024లో ఆళ్లగడ్డ కోర్టులో దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ కూడా కొట్టివేశారు. దీనిపై ఆయన తిరిగి హైకోర్టులో వేసిన రివిజన్ పిటిషన్ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఇంతటి తీవ్రమైన మహిళా వేధింపుల కేసు కోర్టు విచారణలో ఉండగానే, ఆయనకు తహశీల్దార్ స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించటం అన్యాయం. ఉన్నత పదవిలో ఉంటే అధికార బలం ఉపయోగించి సాక్షులను ప్రభావితం చేయడం, బెదిరించడం లేదా రికార్డులను తారుమారు చేసే అవకాశం ఉంది. కావున కోర్టు విచారణ పూర్తయ్యే వరకు ఆయన పదోన్నతిని రద్దు చేయాలని కోరారు.

కడపకు చెందిన రమాదేవి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..గత పది రోజులుగా శివ, కల్పన అనే వ్యక్తులు ప్రతిరోజూ తమ ఇంటికి వచ్చి తీవ్ర అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మేనత్త అని కూడా చూడకుండా శివ దారుణంగా ప్రవర్తిస్తున్నాడు. ముఖంపై దిండు వేసి ఊపిరాడకుండా చేసి చంపేస్తామని, తల్లికూతుళ్లిద్దరినీ వదిలిపెట్టబోమని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. వివాహమై వేరే ప్రాంతంలో నివసిస్తున్న తన కుమార్తె ఇంటికి సైతం వెళ్లి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తమపైనే దౌర్జన్యం చేయడమే కాకుండా, తిరిగి తమపైనే పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు ఇస్తూ వేధిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం చందాపురం గ్రామానికి చెందిన మందడపు శ్రీనివాసమూర్తి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 601లోని 75 సెంట్ల భూమి కుటుంబ భాగపంపిణీ ద్వారా తన తండ్రి మందడపు వెంకటనారాయణకు వచ్చిందని తెలిపారు. గతంలో బాబాయి మందడపు వెంకటేశ్వరరావు గట్లు చెడగొట్టడంతో, మండల సర్వేయర్ ద్వారా భూమిని కొలతలు వేయించి సరిహద్దు రాళ్లను పాతించాం. దీనికి సంబంధించి 13-03-2026న సర్వేయర్ అధికారిక ధ్రువీకరణ పత్రం కూడా జారీ చేశారు. ఇటీవల బాబాయి వెంకటేశ్వరరావు ఉద్దేశపూర్వకంగా తూర్పు గట్టున ఉన్న ప్రభుత్వ సర్వే రాయిని పీకివేసి, ఆ 75 సెంట్ల భూమిని తన పొలంలో కలుపుకుని దౌర్జన్యంగా సాగు చేస్తున్నారు. అధికారికంగా వేసిన సరిహద్దు రాళ్లను ఎందుకు తొలగించావని ప్రశ్నించినందుకు, తనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చంపేస్తామని బెదిరించారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన కొంచంరెడ్డి లక్ష్మిరెడ్డి విజ్ఞప్తి చేస్తూ..తన యాజమాన్యంలోని లారీని (ఏపీ 39 టీవై 1166) తేదీ 10-03-2026న మడుగులూరుకు చెందిన శ్రీనివాసులు కుమారుడు శేఖర్‌కు విక్రయ ఒప్పందంపై అప్పగించామని తెలిపారు. వాహనానికి సంబంధించిన టైర్లు, రిపేర్లు, ఇన్సూరెన్స్, ట్రాఫిక్ చలానాలు, పెండింగ్ కేసులు, ఫైనాన్స్ వాయిదాల పూర్తి బాధ్యతను కొనుగోలుదారుడే భరించాలని పరస్పరం అంగీకరించారు. కొనుగోలుదారు శేఖర్ 6 వాయిదాలు చెల్లించి, ఆ తర్వాత 3 వాయిదాలు ఎగవేశారు. వాహన నిర్వహణ, పత్రాల పునరుద్ధరణ బాధ్యతలను విస్మరించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని తేదీ 13-08-2026న ఆ లారీని తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకున్నాను. ఈ వ్యవహారంలో కొనుగోలుదారుతో పాటు రవాణా బాధ్యతలు చూసిన వ్యక్తుల వ్యవహారశైలిపై విచారణ జరిపించి, తనకు ఆర్థికంగా, న్యాయపరంగా నష్టం కలగకుండా తగిన పరిష్కారం చూపాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.





చైతన్యరథం




ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, పరిశ్రమలు, పెట్టుబడులు మాత్రమే కాదు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, అటవీ సంపద సంరక్షణ, శాస్త్ర-సాంకేతిక రంగాల్లో ముందడుగు కూడా సమానంగా అవసరం. ఈ ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇవి కేవలం ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్ తరాలకు స్థిరమైన అభివృద్ధికి పునాది వేస్తున్నాయి.

# హరిత-సాంకేతిక ఆంధ్ర

- సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కీలక నిర్ణయాలు
- పర్యావరణం, అటవీ, సైన్స్, టెక్నాలజీ రంగాల్లో కూటమి ప్రభుత్వం ముందడుగు
- పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, పరిశోధనలపై ప్రత్యేక దృష్టి



### కాలుష్య నియంత్రణకు సాంకేతిక పరిష్కారాలు

పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వం ముందుగా కాలుష్య నియంత్రణపై దృష్టి పెట్టింది. కాలుష్య నియంత్రణ మండలి పనితీరుపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించింది. ఉప్పాడ తీర ప్రాంత కాలుష్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించి అక్కడి పరిశ్రమలు, కాలుష్య మూలాలపై సమగ్ర పర్యావరణ ఆడిట్ చేపట్టడం విశేషం. తీర ప్రాంత కాలుష్య నియంత్రణలో స్థానిక మత్స్యకారులు, యువతను భాగస్వాములను చేయడం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టింది.

### రియల్ టైమ్ పర్యావరణ పర్యవేక్షణ

రాష్ట్రంలోని పట్టణాల్లో గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు రియల్ టైమ్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ఈ సమాచారం APPCB, రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థతో అనుసంధానమై ప్రజలకు అందుబాటులో ఉండేలా డేటా విజువలైజేషన్ ప్లాట్‌ఫారమ్‌ను కూడా రూపొందిస్తున్నారు. ప్లాస్టిక్, టైర్లు, రబ్బరు, ఈ-వేస్ట్ వంటి వ్యర్థాలను బహిరంగంగా కాల్చకుండా కఠిన చర్యలు చేపట్టడం ద్వారా కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది.

### పరిశ్రమల అభివృద్ధి- పర్యావరణ పరిరక్షణ రెండూ కలిసే

పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా కాకుండా, పరిశ్రమలు పర్యావరణ నిబంధనలు పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. CTE--CTO అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, తక్కువ కాలుష్య పరిశ్రమలకు సులభ అనుమతులు, మధ్యస్థ పరిశ్రమల తనిఖీలకు గుర్తింపు పొందిన మూడోపక్ష సంస్థలను వినియోగించే విధానం అమలు చేయడం ద్వారా పారదర్శకతను పెంచింది. CII భాగస్వామ్యంతో Greening Industries & Buildings కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తూ, GreenCo, IGBC వంటి గ్రీన్ రేటింగ్ విధానాలను పరిశ్రమల్లో విస్తరించేందుకు చర్యలు ప్రారంభించింది.

### ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా...

సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమలు చేయడం ద్వారా ప్రభుత్వం ఆదర్శంగా నిలిచింది. పర్యావరణ హిత ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రారంభించి, ఈ విధానాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, మార్కెట్ల వరకు విస్తరించే చర్యలు చేపట్టింది. "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్", "స్వచ్ఛతా హీ సేవ", "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు.

### హరితాంధ్ర లక్ష్యంగా అటవీ శాఖ చర్యలు

అటవీ విస్తీర్ణాన్ని పెంచడంలో ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోంది. 2024-25, 2025-26ల్లో కలిపి 5,512 హెక్టార్ల అటవీ ప్రాంత పునరుద్ధరణ చేపట్టింది. రాష్ట్ర హరిత విస్తీర్ణాన్ని 50శాతానికి పెంచే లక్ష్యంతో సామాజిక వన కార్యక్రమాలను విస్తరిస్తోంది.

### గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

రాష్ట్రంలోని 974 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని రక్షించేందుకు "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటి దశలో 402 కిలోమీటర్ల తీర ప్రాంతంలో మడ అడవులు, తాటి చెట్లు, తీర ప్రాంతానికి అనువైన మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఉపగ్రహాల ద్వారా గుర్తించిన సుమారు 10వేల ఎకరాల మడ అడవులను రక్షిత పరిధిలోకి తీసుకురావడం మరో ముఖ్య నిర్ణయం.




### మానవ-వన్యప్రాణి సంఘర్షణల నివారణ

అడవుల సమీప గ్రామాల్లో తరచూ ఎదురవుతున్న మానవ-వన్యప్రాణి సంఘర్షణలను తగ్గించేందుకు "ప్రాజెక్ట్ హనుమాన్" ప్రారంభించింది. 93 ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలు, 7 ప్రత్యేక వన్యప్రాణి అంబులెన్సులు, 4 రక్షణ కేంద్రాలు, 19 ప్రత్యేక స్పందన బృందాలను ఏర్పాటు చేసింది. వన్యప్రాణుల దాడిలో మరణించిన వారి కుటుంబాలకు పరిహారాన్ని రూ.10 లక్షలకు, గాయపడిన వారికి రూ.2 లక్షల వరకు పెంచడం ద్వారా బాధిత కుటుంబాలకు భరోసా కల్పించింది.

### ఏఐతో అటవీ సంరక్షణ

ఏనుగులు, పులుల కదలికలను ముందుగానే గుర్తించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత హెచ్చరిక వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్, నర్సరీ నుంచి మొక్క పెరిగే వరకు డిజిటల్ ట్రాకింగ్ వంటి ఆధునిక విధానాలు ప్రవేశపెట్టడం అటవీ నిర్వహణలో సాంకేతికత వినియోగానికి నిదర్శనం.

### యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం

APCOST Innovation Challenge--2025, అవిష్కార్ అవార్డులు, కౌశల్ క్విజ్‌లు, రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించింది.

KL CANSAT బృందం ISRO--IN-SPACe జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరచడం, విద్యార్థుల ఉపగ్రహ ప్రాజెక్టులకు ప్రభుత్వం సాంకేతిక సహకారం అందించడం విశేషం.

### క్వాంటం, ఏఐ, డ్రోన్ టెక్నాలజీపై దృష్టి

AI Meets Quantum Computing అంశంపై అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, క్వాంటం సైన్స్‌పై వెబినార్లు, డ్రోన్ పరిశోధనలకు RedWing Forgeతో భాగస్వామ్యం, Flexible Electronics కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు రాష్ట్రాన్ని భవిష్యత్ సాంకేతిక రంగాల్లో ముందంజలో నిలబెట్టే ప్రయత్నాలు.

### పేటెంట్లు-పరిశోధనలకు ప్రాధాన్యం

26 జిల్లాల్లో పేటెంట్ ఇన్ఫర్మేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి యువ పరిశోధకులకు మేధో సంపత్తి హక్కులపై సహాయం అందిస్తున్నారు. పరిశోధనలను వాణిజ్య ఉత్పత్తులుగా మార్చే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా స్టార్టప్ ఎకో సిస్టమ్‌కు ప్రభుత్వం మద్దతు ఇస్తోంది.

### శాస్త్ర-సాంకేతిక రంగంలో నూతన ఆంధ్రప్రదేశ్

యువతలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, పరిశోధనలను ప్రోత్సహించడం లక్ష్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ పలు కీలక కార్యక్రమాలు చేపట్టింది. రాజమహేంద్రవరంలో రూ.15.20 కోట్లతో స్వామి జ్ఞానానంద ప్రాంతీయ సైన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఇందులో ప్లానెటోరియం, ఇన్నోవేషన్ హబ్, ఫన్ సైన్స్ గ్యాలరీ, యాక్టివిటీ హాల్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు.




### హరిత అభివృద్ధి-సాంకేతిక అభివృద్ధి కలయిక

ఈ రెండేళ్లలో పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, శాస్త్ర-సాంకేతిక రంగాల్లో తీసుకున్న నిర్ణయాలను చూస్తే కూటమి ప్రభుత్వం అభివృద్ధిని కేవలం నిర్మాణాలకే పరిమితం చేయలేదని స్పష్టమవుతోంది. ప్రకృతిని కాపాడుతూ పరిశ్రమలను ప్రోత్సహించడం, అటవీ సంపదను సంరక్షిస్తూ సాంకేతికతను వినియోగించడం, విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడం వంటి చర్యలు భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాదిగా నిలుస్తున్నాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యావరణ పరిరక్షణపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రం "హరితాంధ్ర-సాంకేతికాంధ్ర" లక్ష్య సాధన దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ఈ రెండేళ్ల పనితీరు స్పష్టంగా తెలియజేస్తోంది.

శశికుమార్
తెలుగుదేశం సైనికుడు



## డ్రగ్స్ వద్దు బ్రో... ఈ గల్ క్లబ్స్ స్థాపించిన... ఐజీ ఆకే రవికృష్ణ

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఈగల్ విభాగాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్‌పై నిఘా ఉంచి ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా ఈగల్ విభాగం కీలక ప్రకటన చేసింది.. రాష్ట్రంలో గంజాయి తెచ్చేవారిని, విక్రయించేవారిని పట్టిస్తే రూ.5 వేలు.. అలాగే గంజాయి తాగేవారిని పట్టిస్తే రూ.1,500 ఇస్తామని విజయవాడ పోలసులు ప్రకటించారు. విజయవాడలో గంజాయిపై కఠిన చర్యలు తీసుకున్నామంటున్నారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో 'ఈగల్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ప్రారంభించారు. గంజాయి రవాణా, విక్రయించే 32 మందిపై పిట్ ఎన్డీపీఎస్ యాక్ట్ అమలుచేశామన్నారు విజయవాడ సీపీ రాజశేఖరబాబు. గంజాయిని అరికట్టేందుకు ఈగల్ ఛాలెంజ్ చేపట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 వేల విద్యాసంస్థల్లో డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో ఈగల్ క్లబ్స్ స్థాపించామని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. మొత్తం 849 హాట్‌స్పాట్లను గుర్తించామని.. ఈగల్ కాల్‌సెంటర్ 1972 పెట్టిన తర్వాత తమకు గంజాయిపై తల్లుల నుంచి కాల్స్ ద్వారా సమాచారం వస్తుందన్నారు. విజయవాడలో గంజాయి కట్టడికి చేపట్టిన కార్యక్రమాలను పోలీసులు వివరించారు. ఇటీవల ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 1,287 మంది గంజాయి కేసులతో సంబంధం ఉన్నవారిని ప్రశ్నించారు. వీరిలో పరీక్షలు నిర్వహించగా 1,000 మందికి పైగా నెగెటివ్ వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 469 మందిని పరీక్షిస్తే 128 మందికి గంజాయి తాగినట్లు పాజిటివ్ వచ్చిందన్నారు.

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం : ఎంపీ కలిశెట్టి



శ్రీకాకుళం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గం, లావేరు మండలం, గోవిందపురం పంచాయతీలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, జనరల్ సెక్రెటరీ పిన్నింటి మధుబాబు, సీనియర్ నాయకులు ఇనుపకుర్తి తోటయ్య దొర, మీసాల వెంకటరమణ, లంక నారాయణరావు, ఆరేళ్ల కృష్ణ, ఇజ్జి వెంకటేశ్వరరావు, ఇనపకుర్తి భాస్కరరావు, ఇజ్జి బాబూరావు, ఇజ్జాడ సత్యం, నడిమింటి చార్లెస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామ ప్రజలను నేరుగా కలిసి స్త్రీ శక్తి, తల్లికి వందనం, పెరిగిన పెన్షన్లు, రైతు సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ... సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ... పారదర్శక పాలనతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ... కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. "ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలి" అని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై... ప్రజల సంక్షేమమే లక్ష్యంగా... తెలుగుదేశం పార్టీ ముందుకు! సాగుతుందని తెలియజేశారు.

## ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో చేపట్టిన "2 ఏళ్ల నమ్మకం... అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా 59వ వార్డు పరిధిలోని వాయుపుత్ర కాలనీ, నెహ్రూ నగర్ నుండి లేబర్ జంక్షన్ వరకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గణబాబు పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. వీధుల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే గణబాబు ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ప్రభుత్వ ప్రగతి నివేదికను అందజేశారు. స్థానిక సమస్యలను, ప్రజల అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకుంటూ వాటిని నమోదు చేసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా 'తల్లికి వందనం' పథకం లబ్ధిదారులు ఎమ్మెల్యే గణబాబుని కలిసి తమ అనుభవాలను, ఆనందాన్ని పంచుకున్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందుతుండటంతో పిల్లల చదువులకు ఎంతో భరోసా లభించిందని పలువురు తల్లులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మార్గమధ్యంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు, చిరువ్యాపారులతో ఎమ్మెల్యే స్వయంగా సంభాషించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... విద్యుత్ ఛార్జీల తగ్గింపు: గతంలో విద్యుత్ బిల్లుల భారంతో ప్రజలు ఇబ్బంది పడేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలు, ట్రూ-డౌన్ విధానం ద్వారా యూనిట్‌కు దాదాపు 13 పైసల వరకు ఛార్జీలు తగ్గి ప్రజలకు నేరుగా ఊరట లభించిందని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ పనులు ఊపందుకున్నాయని, తద్వారా భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరకడమే కాకుండా దానికి అనుబంధంగా ఉన్న అన్ని రకాల వ్యాపారాలు, చిరువ్యాపారుల జీవనోపాధి మెరుగుపడిందని వివరించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేరవేయాలని, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో 59వ వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్‌వీ బ్యాడ్మింటన్ అరేనాను ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

● షటిల్ ఆడి యువతను ఉత్సాహపరిచిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): మండలం చినఅవుటపల్లి గ్రామంలో మూడు కోర్టులతో ఏర్పాటు చేసిన ఎస్‌వీ బ్యాడ్మింటన్ అరేనాను ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం ప్రారంభించారు. అనంతరం కొద్దిసేపు షటిల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గన్నవరంలో ఇలాంటి అత్యాధునిక ఇండోర్ బ్యాడ్మింటన్ వేదిక ఇప్పటివరకు లేకపోవడం, ఇప్పుడు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ అరేనాను ఏర్పాటు చేసిన అనిల్‌కుమార్ ను అభినందించారు. గతంలో పంచాయతీ స్థలంలో క్రికెట్ బాక్స్ ఏర్పాటు కావడం, ఇప్పుడు మూడు కోర్టులతో కూడిన ఆధునిక బ్యాడ్మింటన్ కోర్టు రావడం గన్నవరం క్రీడా రంగ అభివృద్ధికి నిదర్శనమన్నారు. గన్నవరం స్థాయికి మించిన సౌకర్యాలతో ఈ వేదికను తీర్చిదిద్దారని పేర్కొన్న ఆయన, యువత పెద్దఎత్తున వినియోగించుకోవాలని కోరారు. ఇటువంటి క్రీడా వేదికలను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సౌకర్యాలు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇండోర్ క్రీడా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వరదల్లో చిక్కుకున్న భీమిలి నాయకులకు ధైర్యం చెప్పిన గంటా



విశాఖపట్నం (చైతన్యరథం): నేపాల్ వరదల్లో చిక్కుకున్న భీమిలి టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఫోన్‌లో మాట్లాడారు. వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఆయన సోదరుడు గాడు వెంకట నారాయణ, గాడు తాతినాయుడు తదితరులు మొత్తం 8 మంది ఈనెల 21 న విశాఖ నుంచి బయలుదేరి 22 న ఖాట్మండు చేరుకున్నారు. మానస సరోవర్ కు ఎక్కువ మంది సందర్శకులు రావడం వల్ల చైనా నుంచి వీసా జారీ ఆలస్యమైందని వివరించారు. తమకన్నా ముందు వెళ్లిన పశ్చిమ బెంగాల్ కు చెందిన టూరిస్ట్ బస్సులు రెండు గల్లంతయ్యాయని, అదృష్టవశాత్తు తాము తప్పించుకోగలిగామని బాధితులు గంటాకు వివరించారు. ఆ రోజు తెల్లవారు జామున 4.30 గంటల విమానానికి టికెట్లు దొరక్క ఆ తర్వాత విమానంలో వెళ్లామని, చైనా ఎంబసీకి 80 కిలో మీటర్ల దూరంలో ఆకస్మిక వరద ముట్టడించిందని చెప్పారు. స్థానికుల హెచ్చరికలతో తాము ప్రయాణిస్తున్న బస్సును డ్రైవర్ యూ టర్న్ తీసుకుని వేగంగా కొండపైకి తీసుకువెళ్లడం వల్ల బతికి బయటపడ్డామన్నారు. బాధితులకు కావాల్సిన సహాయ సహకారాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని గంటా వారితో చెప్పారు. ఏ సాయం కావాలన్నా వెంటనే తెలియజేయాలని సూచించారు. కాగా గాడు వెంకటప్పడు కుటుంబం శు క్రవారం రాత్రి విశాఖకు చేరుకోనుంది.

## వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న టీడీపీ ఎమ్మెల్యే గణబాబు



సింహాచలం (చైతన్యరథం): శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, సింహాచలం క్షేత్రాన్ని గురువారం విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు సింహగిరిపై కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ సంప్రదాయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె ప్రసాద్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా ఆలయ మహాద్భుతమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం, వారు అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం, ఆలయ వేదపండితులు వారికి మంత్రోచ్ఛారణలతో వేద ఆశీర్వచనాలను అందించారు. పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె ప్రసాద్ ప్రసాదాలను అందజేశారు.

## ఉత్తరాంధ్రకు పోలవరం ద్వారా గోదావరి జలాలు... ఎడమ కాలువ ట్రయల్ రన్

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు కల సాకారం కాబోతోంది.. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీళ్లను అందించేందుకు కీలక ముందడుగు పడింది. సెప్టెంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా గోదావరి జలాలకు హారతి ఇవ్వనున్నారు. దీని కోసం ముందుగా ట్రయల్ రన్ నిర్వహించారు. పోలవరం ఎడమ కాలు నిర్మాణ పనులు పూర్తి కావడంతో ట్రయల్ రన్‌లో భాగంగా కొంత దూరం నీళ్లు వదిలారు. కొంత మేర నీటిని పోలవరం ఎడమ కాలువలో 67వ కిలోమీటరు దగ్గర రెగ్యులేటర్ వరకు తీసుకువచ్చి ఆపారు. అక్కడి నుంచి 85వ కిలోమీటరు క్రాస్‌బండ్ వరకు ట్రయల్ రన్‌గా నీళ్లు విడుదల చేస్తున్నారు.. అక్కడ కొంత నీళ్లు నిల్వ చేస్తారు. అలా 111వ కిలోమీటరు వరకు ట్రయల్ రన్ నిర్వహించాలని ఆలోచన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా 111 కిలోమీటరు దగ్గర అనకాపల్లి జిల్లాకు నీళ్లు వదిలేలా కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తున్నారు. అందుకే ముందుగా ట్రయల్ రన్ నిర్వహించి నీళ్లు వదులుతున్నారు. సెప్టెంబరు 2 లేదా 3న ముఖ్యమంత్రి చంద్రబాబు అనకాపల్లి జిల్లాకు నీళ్లు విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. గోదావరి వరద జలాలు పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా ఎడమ కాలువ నుంచి అనకాపల్లి వరకు ఇవ్వాలని ప్లాన్ చేశారు. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు ఎడమ కాలువ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో ప్రవహిస్తాయి. ఉత్తరాంధ్రకు గోదావరి జలాల విడుదలపై హోంమంత్రి అనిత ట్వీట్ చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరాంధ్ర రైతాంగానికి ఒక చారిత్రాత్మక ముందడుగుగా అభివర్ణించారు. సెప్టెంబర్ మొదటి వారంలో జరగనున్న జలహారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. సారిపల్లిపాలెంలో హోంమంత్రి ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఘన స్వాగత ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సీతారాంపురం--పీఎల్ పురం దగ్గర జలహారతి ఇస్తారని చెబుతున్నారు. ఉత్తరాంధ్రకు పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు చేరితే తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు ఇబ్బందులు తొలగిపోతాయంటున్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# రైతులకు భరోసా ఇచ్చే నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ



పెదన (చైతన్యరథం): గూడూరు మండలం పోలవరం గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పెదన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిచేస్తోందని అన్నారు. రైతుల భూములకు సంబంధించి నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం రీ-సర్వే ప్రక్రియకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రీ-సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు, ప్రభుత్వ రాజముద్రతో అందిస్తున్న నూతన పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు భరోసాను కల్పిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో రైతులు బ్యాంకు రుణాలు పొందేందుకు, వివిధ ప్రభుత్వ పథకాలను సులభంగా పొందేందుకు ఈ పాసు పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది, అందులో భాగంగానే భూ యజమానుల ఫోటోలతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. గత పాలకులు వ్యవస్థలను ఏ విధంగా నిర్వీర్యం చేశారో ప్రజలందరికీ తెలుసని విమర్శించారు. ప్రజల ఆస్తులకు సంబంధించిన పత్రాలపై కూడా వ్యక్తిగత ప్రచారానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రజాధనంతో పబ్లిసిటీ చేసుకున్నారని మండిపడ్డారు.

# ప్రగతి నగర్లో అభివృద్ధికి పట్టం కడతాం

●అన్ని ప్రాంతాలకు మహర్దశ తీసుకొస్తున్నాం

●రూ.8.75 కోట్లతో డ్రెయిన్లు, మంచినీటి పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఎన్నో ఏళ్లుగా వెనకబడిన ప్రాంతమైన ప్రగతి నగర్లో అభివృద్ధికి పట్టం కడుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ప్రగతి నగర్, బాలాజీ నగర్ నందమూరి కాలనీ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి రూ. 8.75 కోట్లతో ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పదేళ్ళ వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ప్రధాన ప్రాంతాల్లో సైతం రోడ్లు నిర్మాణం చేపట్టిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మారుమూల కాలనీలకు మంచినీళ్లు కూడా అందించలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వంద కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామని తెలిపారు. తల్లికి వందనం అమలుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారన్నారు. ఇప్పటికే గూగుల్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి తరలివచ్చాయని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

# ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కుమార్తె వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్



విశాఖపట్నం (చైతన్యరథం): ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. విశాఖ ఏయూ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులు అస్మిత నాయుడు, పవన్ మౌళిలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# బీసీలకు న్యాయం చేసేది కూటమి ప్రభుత్వమే : ఎంపీ పుట్టా మహేష్

●34 శాతం రిజర్వేషన్లు ప్రకటించి బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం హర్షణీయం



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): రెండేళ్ల కూటమి పాలన విజయాలు అలాగే బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లపై జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు ఆధ్వర్యంలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్ పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ మహేష్ మాట్లాడుతూ... టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కిస్తుందని అన్నారు. సంక్షేమం చిరునామాగా ముందుకు వెళ తుందని అన్నారు. బీసీలకు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర అన్యాయం జరిగితే ఈ ప్రభుత్వంలో పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు. 34 శాతం రిజర్వేషన్లు ప్రకటించి బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. బీసీల రాజకీయ ఆర్థిక సాధికారత కూటమితోనే సాధ్యమని అన్నారు. శేషు శ్రీనివాసపురం, పట్టెన్నపాలెం గ్రామాల కోసం అడిగిన స్మశాన వాటిక అభివృద్ధి, ఎస్సి కమ్యూనిటీ హాల్, ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ, సొసైటీ గోడౌన్ అన్ని కూడా చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాకే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది అని ప్రతి పల్లెలో రోడ్ల నిర్మాణం చేపట్టామని అన్నారు. కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు అని అన్నారు. ఈ సందర్భంగా 3కోట్ల 78 లక్షలతో నిర్మించిన శ్రీనివాసపురం ములగలంపల్లి బిటి రోడ్డు అలాగే అక్కంపేట రోడ్డు శ్రీనివాసపురంలో జెడ్పి నిధులతో నిర్మించిన కోటి 50 లక్షల విలువ గల రోడ్లు డ్రైనేజీలను ఎంపీ ప్రారంభించారు. మైసన్నగూడెం సొసైటీ గోడౌన్ గన్ని ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎఎంసి వైస్ చైర్మన్ మరిశెట్టి సత్యనారాయణ, కుక్కల మాధవరావు, ఆకుల రాకేష్, గురుజు ఉమామహేశ్వరి, బిజెపి రామలక్ష్మి, కొప్పాక శ్రీను, రాజన సత్యనారాయణ, తన్నీరు రామకృష్ణ, తడికల దావీదు, తాళ్లూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ..7.73 లక్షల సాయం



అమృతలూరు (చైతన్యరథం): వేమూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.7,73,839 సాయాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న శివ నాగేంద్రమ్మ, శ్రీనివాసరావు, ప్రేమానందం వైద్య ఖర్చుల వివరాలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సు ద్వారా సీఎం సహాయనిధి కార్యాలయానికి పంపారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం ఆర్థిక సహాయం లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మంజూరు చేసింది. ఈ మేరకు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే స్వయంగా ఎల్బీసీ పత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో అవసరమైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించింది టీడీపీనే

● కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ సర్వ సభ్య సమావేశంలో నేతల వెల్లడి



మచిలీపట్నం (చైతన్యరథం): కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏపీ రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జాతీయ కోశాధికారి కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో బీసీల సంక్షేమం, బీసీ రిజర్వేషన్లు, రానున్న ఎన్నికలు, వర్షాభావ పరిస్థితులు, పంటల సాగు, నీటి లభ్యత, రైతుల సమస్యలు, ఇంటింటి ప్రచారం, పార్టీ సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏపీ రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ...** బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించామని, అనంతరం చంద్రబాబునాయుడు హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించామని పేర్కొన్నారు. ఆదరణ పథకం ద్వారా రూ.964 కోట్లతో 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో బీసీ చేతివృత్తిదారులకు అందించామని తెలిపారు. బీసీ సంక్షేమానికి ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి భారీగా నిధులు కేటాయించడంతో పాటు, బీసీ కార్పొరేషన్ల ద్వారా లక్షలాది మందికి రుణాలు, ఆర్థిక సహాయం అందించామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని గురుమూర్తి విమర్శించారు. తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్ తదితర బీసీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు, హత్యల ఘటనలను బీసీ సమాజం మరిచిపోలేదని అన్నారు.

**ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జాతీయ కోశాధికారి కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ...** తనకు మూడు సార్లు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించి, తనపై నమ్మకం ఉంచిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ, బీసీ నాయకులకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని తెలిపారు. తనకు మూడు పర్యాయాలు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వడం ద్వారా బీసీ నాయకత్వంపై టీడీపీకి ఉన్న నమ్మకాన్ని పార్టీ నిరూపించిందని పేర్కొన్నారు.

**మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ...** జగన్మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితాలపై తన పార్టీ నేతలతో హైకోర్టులో కేసులు వేయించారని ఆరోపించారు. ఓటమి భయంతోనే జగన్ ఇటువంటి కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ హైకోర్టులో కేసులు వేశారని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక కుంటిసాకులు చెబుతూ ఎన్నికలను ఆపేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.

**మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ...** రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజలకు వివరించి, ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

# గవర్నర్ చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన

● గ్రామ విశిష్టత, ఆలయ విశేషాలను స్వయంగా గవర్నర్‌కు వివరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): బొప్పూడి కొండపై కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.10.99 కోట్ల టీటీడీ నిధులతో చేపట్టిన పలు పనులకు గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణ మోహన్, జిల్లా న్యాయమూర్తి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహా పలువురు ప్రముఖులతో కలిసి గొప్ప దైవకార్యంలో పాలుపంచుకోవడం మంచి ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. గురువారం బొప్పూడిలో జరిగిన ఆలయాభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బొప్పూడి గ్రామ విశిష్టత, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయ విశేషాలను ప్రత్తిపాటి స్వయంగా గవర్నర్‌కు వివరించారు. తమ నియోజకవర్గంలో ఒక మంచి కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్‌కు ప్రత్తిపాటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. గురువారం చిలకలూరిపేట మండలం బొప్పూడి పర్యటనకు విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్ స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా పలు పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామంలో నిర్మించనున్న పుష్కరిణి పనులకు భూమిపూజ చేసిన ఆయన, అక్కడే ఏర్పాటుచేయనున్న గరుడ విగ్రహానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ పండితుల వేదాశీర్వచనం పొందారు. తర్వాత కొండపైకి వెళ్లే మెట్లమార్గం వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఆయన.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు.

# అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



కంకిపాడు (చైతన్యరథం): కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. కానూరు, తులసినగర్, యనమలకుదురు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వెల్ నెస్ సెంటర్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో వెల్ నెస్ సెంటర్ ఏర్పాటుకు రూ.26 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వీటిలో 8 మంది సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, రోగులకు సుమారు 150 రకాల వైద్య చికిత్సలు ఇక్కడ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే మున్సిపాలిటీకి రూ.50 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈ మున్సిపాలిటీకి కృష్ణా నది నుంచి తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.400 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. వాటికి టెండర్లు పిలిచి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు.

# మహిళలకు ఉపాధి కల్పించే ప్రతి ప్రయత్నానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

●వికాస్ నగర్‌లో 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ, సర్టిఫికెట్ల పంపిణీ... రాయితీ ధరకు ఉషా కుట్టు మిషన్ల అందజేత



గుంటూరు (చైతన్యరథం): మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడానికి నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని, అటువంటి మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గురువారం గుంటూరు వికాస్ నగర్‌లో మదర్ తెరీసా బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, టైలరింగ్ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకురాలు, మాజీ కార్పొరేటర్ అభ్యర్థి, మిర్చీయార్డ్ డైరెక్టర్ కటకం శెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మదర్ తెరీసా బహుజన సేవా సమితి చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా తొలి విడతలో 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందించడంతో పాటు వారికి రాయితీ ధరకు ఉషా కంపెనీ కుట్టు మిషన్లను అందజేశారు. సాధారణంగా రూ.8,000 విలువ చేసే కుట్టు మిషన్‌ను కేవలం రూ.4,000కే అందించడం ద్వారా మహిళలకు ఆర్థిక భారం తగ్గిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మదర్ తెరీసా బహుజన సేవా సమితి పనిచేస్తోందని, ఈ లక్ష్య సాధనలో విజయలక్ష్మి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం.. స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

●పల్నాడు జిల్లా తెలుగుదేశం కార్యాలయం నందు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు



పల్నాడు (చైతన్యరథం): పార్టీ బలోపేతమే లక్ష్యంగా స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు షేక్ జానీ సైదా, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ పాల్గొని పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సమాయత్తం కావాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి మండలంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని, టీడీపీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో చర్చించారు. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తూ, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయిలో రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రజల మద్దతును కూడగట్టేందుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం సూచనలు, నిర్ణయాలను ప్రతి స్థాయి నాయకుడు, కార్యకర్త సమర్థవంతంగా అమలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# రక్షాబంధన్ సోదరభావానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక

●బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

●చీఫ్ విప్ జీవీకు పవిత్ర రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్ సోదరీమణులు



వినుకొండ (చైతన్యరథం): రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా వినుకొండ పట్టణంలోని ఇసుక వాగు బజార్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రంలో రక్షాబంధన్ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సోదరీమణులు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకి పవిత్ర రాఖీ కట్టి వేద ఆశీర్వచనాలతో ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆయన ధ్యాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని, ఆధ్యాత్మికత ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానం ఉందన్నారు. రాఖీ కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధానికి మాత్రమే కాకుండా పరస్పర గౌరవం, విశ్వాసం, సోదరభావం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో ఒత్తిళ్లు, విభేదాలు పెరుగుతున్న తరుణంలో ఆధ్యాత్మిక చింతన, ధ్యానం, మానవతా విలువలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరిలోనూ సానుకూల ఆలోచనలు, ఆత్మవిశ్వాసం, సేవాభావాన్ని పెంపొందించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు, సోదరీమణులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఏపీఐడీసీ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ

●పారిశ్రామిక ప్రగతిపై పాలకవర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చ

●చైర్మన్ డేగల ప్రభాకర్ అధ్యక్షతన కీలక అంశాలపై సమీక్ష



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడం, కార్పొరేషన్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం, పారిశ్రామిక రంగానికి మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టడంపై నేడు తాడేపల్లిలోని ఏపీఐడీసీ కార్యాలయంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, కార్పొరేషన్ ఉన్నతాధికారులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు సమగ్ర వివరాలను పాలకవర్గానికి అందించారు.

**అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష**

సమావేశంలో ఏపీఐడీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలు, కార్పొరేషన్ అభివృద్ధి పురోగతి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాల ఫలితాలను సమీక్షించడంతో పాటు, మరింత సమర్థవంతంగా ముందుకు వెళ్లేందుకు అవసరమైన చర్యలపై పాలకవర్గ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పారిశ్రామిక రంగానికి అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం, పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించడం, పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో చర్చించారు.

**పాలకవర్గ సభ్యుల సూచనలు**

కార్పొరేషన్ అభివృద్ధి, పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై పాలకవర్గ సభ్యుల నుంచి చైర్మన్ డేగల ప్రభాకర్ సూచనలు, సలహాలు స్వీకరించారు. సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడిస్తూ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

**పారిశ్రామిక ప్రగతికి ప్రాధాన్యత**

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు కొత్త పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంలో ఏపీఐడీసీ మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. పారిశ్రామికవేత్తలకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచనలు చేసినట్లు సమావేశంలో వెల్లడించారు.

**భవిష్యత్ కార్యాచరణపై దృష్టి**

ఏపీఐడీసీ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి కూడా సమావేశంలో కీలకంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగ అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కార్పొరేషన్ తన కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పాలకవర్గం అభిప్రాయపడింది.

# వెలుగొండకు సీఎం రాకకు మద్దతుగా భారీ ట్రాక్టర్ ర్యాలీ

## పాల్గొన్న యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్సన్‌బాబు



యర్రగొండపాలెం (చైతన్యరథం): ఈనెల 31న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ను జాతికి అంకితం చేయడమే కాకుండా కృష్ణా జలాలను విడుదల చేస్తున్న సందర్భంగా యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్సన్ బాబు ఆధ్వర్యంలో రైతులు, టీడీపీ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయం నుండి పుల్లలచెరువు రోడ్డు వరకు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రజలు రైతులు వేలాదిగా తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటన ను దిగ్విజయం చేయవలసినదిగా కోరారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ముఖ్య నేతలు, గిరిజన నాయకులతో సమావేశమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగొండ పర్యటన ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, గిరిజన నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు

# ఒంగోలులో టీడీపీ పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం

## పాల్గొన్న నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ జోనల్ కో ఆర్డినేటర్ మద్దిపాటి వెంకట రాజు, ఒంగోలు అధ్యక్షుడు డాక్టర్ ఉగ్ర



ఒంగోలు (చైతన్యరథం): పార్లమెంటు తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు రాం నగర్ 2వ లైన్ లోని మాగుంట కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు, ఒంగోలు పార్లమెంట్ జోనల్ కో ఆర్డినేటర్ మద్దిపాటి వెంకట రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ కల్చరల్ కమిషన్ చైర్మన్ పొదపాటి తేజస్వి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొటారి నాగేశ్వరరావు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# జెన్‌జీ యువత ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేస్తా

## భేటీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి వెల్లడి



శ్రీధర్ రెడ్డి నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గం పరిధిలోని శ్రీ హర్ష కోచింగ్ సెంటర్‌లో విద్యార్థినీ విద్యార్థులతో ఆత్మీయ భేటీలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీ హర్ష కోచింగ్ సెంటర్ విద్యార్థిని విద్యార్థులతో 3 గంటల పాటు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆత్మీయ భేటీ సాగింది. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నిత్యం ప్రజల్లో ఉండడం నాకు ఇష్టం. నేను ఎల్లప్పుడూ ప్రజల పక్షమే. గత 3ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ప్రజలు నన్ను ప్రజలు ఆదరించారని అన్నారు. యువత భవిష్యత్తు కోసం నారా లోకేష్ బంగారు బాట వేస్తున్నారరానన్నారు. జెన్-జీ యువత అంటే నాకెంతో ఇష్టమని వారి ఆకాంక్షలకు అనుగుణంగా స్థానిక శాసనసభ్యుడుగా పనిచేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు.

# విస్తృతంగా ఒంగోలు టీడీపీ సమావేశం

ఒంగోలు (చైతన్యరథం): నియోజకవర్గానికి విచ్చేయనున్న రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఈరోజు మధ్యాహ్నం ఒంగోలు నగరంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించడం జరిగింది. జిల్లా కలెక్టర్ రాజబాబు గారు, ప్రోగ్రామ్ కోర్డినేటర్ రాజు, లోకేష్ బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కిమ్స్ జంక్షన్ నందు ఏర్పాటు చేసిన మహనీయులు విగ్రహాలు ప్రారంభోత్సవ కార్యక్రమం, రంగారాయుడు చెరువు నందు 424 కోట్ల త్రాగునీరు పథకం శంకుస్థాపన కార్యక్రమం మరియు కార్యకర్తల సభ వేదిక ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు మరియు వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. మన నియోజకవర్గానికి వస్తున్న మంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు, కార్యకర్తలకు ఎక్కడా ఎలాంటి చిన్న అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతం చేయాలని అధికారులకు పార్టీ నాయకులకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోర్డినేటర్డ గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు, జిల్లా పార్టీ అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, నియోజకవర్గ పరిశీలకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అధునాతన ఫైర్ ఇంజన్‌తో మరిన్ని మెరుగైన సేవలు

## నూతన ఫైర్ ఇంజన్‌ను ప్రారంభించిన మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అత్యవసర సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ పట్టణంలో రూ.75 లక్షల విలువైన నూతన అధునాతన ఫైర్ ఇంజన్‌ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండా ఊపి సేవలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 25 నూతన ఫైర్ ఇంజన్లను ప్రారంభించడం శుభ పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ ఫైర్ ఇంజన్ ద్వారా పెనుకొండ నియోజకవర్గంలో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో సకాలంలో స్పందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి సవిత అన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం అత్యవసర సేవలను మరింత బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి సూచించారు. నూతన ఫైర్ ఇంజన్ పెనుకొండ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వసతులతో మెరుగైన వైద్యసేవలు

## కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి (చైతన్యరథం): కావలి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని స్థానిక శాసనసభ్యుడు కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం కావలి పట్టణంలోని క్రిస్టియన్ పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏవీ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానంతో కూడిన వైద్య పరీక్షలు స్థానికంగా లభించడం వల్ల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. నాణ్యమైన సేవలను అందిస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం, మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులు శ్రీనివాసులును ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పట్టణ ప్రజలకు సరసమైన ధరకు, ఖచ్చితమైన ఫలితాలతో కూడిన మంచి వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డయాగ్నోస్టిక్స్ సెంటర్ నిర్వాహకులు, స్థానిక నాయకులు, ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.



# కంది పంటను పరిశీలించిన మంత్రి సవిత

## కష్టమొస్తే తానున్నానని రైతులకు భరోసా



రొద్దం (చైతన్యరథం): సత్యసాయి జిల్లా రొద్దం మండలం కందుకుర్లపల్లి గ్రామానికి సమీపంలో రైతులు సాగు చేస్తున్న కంది పంటను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలో పంట పరిస్థితిని పరిశీలించిన మంత్రి రైతులతో మాట్లాడారు. కంది సాగుకు పెట్టుబడి, విత్తనాలు, ఎరువులు, సాగునీటి సౌకర్యం, పంట దిగుబడి అంచనా, మార్కెట్ ధరలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి పంట సాగులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్న మంత్రి, రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర, అవసరమైన వ్యవసాయ సౌకర్యాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సవితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# శరవేగంగా వెలుగొండ ఏర్పాట్లు

## పరిశీలించిన యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు

యర్రగొండపాలెం (చైతన్యరథం):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, నీటిని విడుదల చేసి జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దోర్నాల మండలం గంటవాని పల్లి గ్రామం వద్ద యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, ముఖ్యమంత్రి టూర్ కోఆర్డినేటర్ రఘు, వెలిగొండ ప్రాజెక్ట్ అధికారులు దోర్నాల మండల నాయకులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్, వెలిగొండ ప్రాజెక్ట్ పనులు, ఫీడర్ కెనాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వెలిగొండ జలాలతో యర్రగొండపాలెం నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నం సాకారం కానున్న ఈ చారిత్రాత్మక ఘట్టానికి నియోజకవర్గ ప్రజలు, రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని గూడూరి ఎరిక్షన్ బాబు పిలుపునిచ్చారు.



# మంత్రి లోకేశ్ రాకకు పకడ్బందీ ఏర్పాట్లు

## సమీక్షించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు



ఒంగోలు (చైతన్యరథం): నియోజకవర్గానికి విచ్చేయనున్న రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో మధ్యాహ్నం ఒంగోలు నగరంలో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాజబాబు, ప్రోగ్రామ్ కోర్డినేటర్ రాజు, లోకేష్ బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కిమ్స్ జంక్షన్ నందు ఏర్పాటు చేసిన మహనీయులు విగ్రహలు ప్రారంభోత్సవ కార్యక్రమం, రంగారాయుడు చెరువు 424 కోట్ల త్రాగునీరు పథకం శంకుస్థాపన కార్యక్రమం కార్యకర్తల సభ వేదిక ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గానికి వస్తున్న మంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు, కార్యకర్తలకు ఎక్కడా ఎలాంటి చిన్న అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతం చేయాలని అధికారులకు, పార్టీ నాయకులకు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోర్డినేటర్డ గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు, జిల్లా పార్టీ అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డి, ఏపీటీడీ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, నియోజకవర్గ పరిశీలుకులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# వాడవాడలా వెలుగొండ సంబరాలు

## పర్యవేక్షిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం (చైతన్యరథం): వెలుగొండ ప్రాజెక్టుకు ఈనెల 31వ తేదీ నీటి విడుదల సందర్భంగా మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి కృతజ్ఞతగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం మార్కాపురం పట్టణంలోని దోర్నాల బస్టాండ్ సెంటర్ నుండి నాయుడు బజార్, అమ్మవారి శాల, గడియార స్తంభం సెంటర్, దోర్నాల బస్టాండ్ వరకు మహిలు, విద్యార్థుల ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాజెక్టు ప్రారంభించి జల హారతి ఇవ్వనున్నారని ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొని ఉందని ప్రజలు లేనంత సంతోషంగా ఉన్నారని తెలిపారు. అందుకే మార్కాపురం పట్టణంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ, నిన్న భారీ బైక్ ర్యాలీ, మహిళల ఆధ్వర్యంలో వినూత్న కోలాటం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదలకు ఎటువంటి ఆటంకాలు రాకుండా రేపు మహిళల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆలయం నుండి కాలేజీ రోడ్లో ఉన్న గంగమ్మ తల్లి ఆలయం వరకు మహిళలు కలశాలతో వెళ్లి గంగమ్మకు అభిషేకం చేయనున్నారని దీనికి మహిళలందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం అందర్నీ అలరించింది.



వెలుగొండ ప్రాజెక్టుకి కృష్ణా జలాల విడుదల సందర్భంగా యర్రగొండపాలెంలో గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ



అనంతపురం పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారధి, సహచర శాసనసభ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు




# సామాజిక సేవలో ‘తానా’ ముందంజ

## న్యూజెర్సీలో పేద విద్యార్థులకు 100 బ్యాక్ ప్యాక్‌లు పంపిణీ

**న్యూజెర్సీ:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సామాజిక సేవలో భాగంగా న్యూజెర్సీలోని పెర్త్ అంబాయ్‌లో ఉన్న రారిటన్ YMCA–సెంటర్ ఫర్ సపోర్ట్, సక్సెస్ & ప్రాస్పెరిటీలో ‘బ్యాక్‌ప్యాక్ అండ్ స్కూల్ సప్లైస్ డొనేషన్ ప్రోగ్రామ్’ నిర్వహించింది. ఇందులో భాగంగా ఆర్థికంగా అవసరమైన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 100 బ్యాక్‌ప్యాక్‌లను సిద్ధం చేశారు. ప్రతి బ్యాక్ ప్యాక్‌తో పాటు నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్స్, మార్కర్స్, క్రేయాన్స్, రూలర్స్, ఎరేజర్స్, ఫోల్డర్స్ తదితర సుమారు 20 రకాల పాఠశాల సామగ్రిని సమకూర్చారు. తానా కోశాధికారి రాజా కసుకుర్తి, తానా ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేక, తానా న్యూజెర్సీ బృంద సభ్యులు, పలువురు లిలితానా యువ వాలంటీర్లు బ్యాక్‌ప్యాక్‌లు, పాఠశాల సామగ్రిని విద్యార్థులు, వారి కుటుంబాలకు అందజేశారు.

తానా కోశాధికారి రాజా కసుకుర్తి మాట్లాడుతూ... ‘అమెరికాలో అయినా, భారతదేశంలో అయినా అవసరంలో ఉన్న సమాజాలకు అండగా నిలవడం మా ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. విద్యార్థులకు బ్యాక్‌ప్యాక్‌లు, అవసరమైన పాఠశాల సామగ్రి అందించడం చిన్న సహాయంగా కనిపించినా, అది వారిలో కొత్త విద్యా సంవత్సరంపై ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెంచుతుంది. అదే సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలపై పాఠశాల సామగ్రి కొనుగోలు భారాన్ని కొంత వరకు తగ్గిస్తుంది. ఈ చిన్నారులు మరింత ఉత్సాహంతో చదువులో ముందుకు సాగేందుకు ఈ కార్యక్రమం ప్రేరణ కలిగిస్తుందని ఆశిస్తున్నాం’ అన్నారు. తానాకు అవకాశం కల్పించిన రారిటన్ YMCA–సెంటర్ ఫర్ సపోర్ట్, సక్సెస్ & ప్రాస్పెరిటీ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన న్యూజెర్సీ బృందాన్ని, నిర్వాహకులను, యువ వాలంటీర్లను తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, న్యూజెర్సీ రీజినల్ రిప్రజెంటేటివ్ సుధీర్ చంద్ నరే పాలెపు, తానా ఫౌండేషన్ కోశాధికారి శ్రీనివాస్ ఒరుగంటి, తానా యూత్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ చెరుకూరి అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. విద్య, యువత అభివృద్ధి, సామాజిక సంక్షేమానికి తోడ్పడటంతో పాటు అమెరికాలోని స్థానిక సమాజాలతో తానా అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ముఖ్యమైనవని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న తానా యువ వలంటీర్లను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. యువతలో సేవా భావం, సామాజిక బాధ్యత, అవసరంలో ఉన్న వారికి సహాయం చేయాలనే ఆలోచన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. Giving Back to the Community అనే స్ఫూర్తితో తానా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ బ్యాక్‌ప్యాక్ పంపిణీ ద్వారా న్యూజెర్సీలోని అవసరమైన చిన్నారులు, కుటుంబాలకు అండగా నిలిచి, సమాజ సేవ పట్ల తన నిబద్ధతను తానా మరోసారి చాటుకుంది.









# పరిశోధనల్లో అరుణ కిరణం

## ప్రతిష్టాత్మక ‘ఫుల్‌బ్రైట్-నెహ్రూ యూఎస్ స్కాలర్’గా ఎంపికైన కిలారు అరుణ



**టెన్నెసీ:** జీవితంలో అనుకున్న లక్ష్యాల వైపు సాగే ప్రయాణంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో శ్రమిస్తే విజయం సొంతమవుతుందని నిరూపించారు ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ కిలారు అరుణ. చిన్ననాటి వైద్యురాలి కల నెరవేరక పోయినా, పీహెచ్‌డీ మధ్యలోనే ఆగిపోయినా, ఉద్యోగ, వ్యాపారాల్లో ఇబ్బందులు ఎదురైనా ఆమె ఎక్కడా నిరుత్సాహపడలేదు. మూడేళ్ల చిన్నారి కూతురితో కలిసి అమెరికా వెళ్లి అక్కడ కఠోర శ్రమతో డాక్టరేట్ సాధించి నేడు అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామి శాస్త్రవేత్తగా ఎదిగారు. తాజాగా ప్రతిష్టాత్మక ‘ఫుల్‌బ్రైట్–నెహ్రూ అకడమిక్ అండ్ ప్రొఫెషనల్ ఎక్సలెన్స్ యూఎస్ స్కాలర్’గా ఎంపికై సత్తా చాటారు.

ఏలూరులోని సెయింట్ థెరిసా విద్యా సంస్థల్లో అరుణ విద్యాభ్యాసం సాగింది. పదో తరగతిలో జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో లభించిన బహుమతి ఆమెలో పరిశోధనలపై ఆసక్తి పెంచింది. డాక్టర్ కావాలని ఎంతగానో ప్రయత్నించినప్పటికీ మెడిసిన్ సీటు రాకపోవడంతో గుజరాత్‌లోని ఎంఎస్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని సీసీఎంబీలో పీహెచ్‌డీ అవకాశం వచ్చినా కొన్ని కారణాలతో పూర్తి చేయలేకపోయారు. చిన్నారి కూతురితో కలిసి అమెరికా వెళ్లిన అరుణ యూనివర్సిటీ ఆఫ్ లూసియానాలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తర్వాత యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్, మిచిగన్ స్టేట్ యూనివర్సిటీల్లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా పని చేశారు. ప్లాంట్ బయాలజీ, లిపిడ్ బయోకెమిస్ట్రీ రంగాలు, నాచు మొక్కలు, అవకాడోలపై ఆమె చేసిన విస్తృత పరిశోధనలకు నేషనల్ సైన్స్ ఫౌండేషన్, యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ నుంచి మిలియన్ల డాలర్ల పరిశోధనా నిధులు లభించాయి. ప్రస్తుతం ఆమె ఈస్ట్ టెన్నెసీ స్టేట్ యూనివర్సిటీ బయో సైన్సెస్ విభాగంలో డిస్టింగిష్డ్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

పరిశోధనాశాలలకే పరిమితం కాకుండా యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ ఫెలోగా, నేషనల్ సైన్స్ ఫౌండేషన్‌లో ప్రోగ్రాం డైరెక్టర్‌గా పాలసీ స్థాయిలోనూ సేవలు అందించారు. గత రెండు దశాబ్దాలుగా అమెరికన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ బయోలాజిస్ట్స్‌లో నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ మహిళా శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు నిరంతరం మార్గదర్శనం చేస్తున్నారు. ప్రస్తుతం ఫుల్‌బ్రైట్–నెహ్రూ స్కాలర్‌గా ఎంపికైన అరుణ గుజరాత్‌లోని మొహాలీ సమీపంలోని ‘నేషనల్ అగ్రి–ఫుడ్ అండ్ బయోమాన్యుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలతో కలిసి ‘ప్లాంట్ సెల్ బయోమాన్యుఫ్యాక్చరింగ్’పై పరిశోధనలు చేయనున్నారు.

# అమెరికాలో వైభవంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ స్వర్ణ యాత్ర

**యూఎస్ఏ:** మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ 1976లో తొలిసారిగా అమెరికాలో పర్యటించారు. ఈ సంవత్సరం ఆయన పర్యటన 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో స్వామీజీ తొమ్మిది నగరాల్లో 42 రోజులకు పైగా స్వర్ణ యాత్ర చేశారు. బాటనరూజ్, ఆస్టిన్, హ్యూస్టన్, డల్లాస్, పిట్స్‌బర్గ్, వాషింగ్టన్ డీసీ, ఒమాహా, ఫ్రీమాంట్ నగరాల్లో ఆయన పర్యటించారు. జయలక్ష్మి దత్త యోగా సెంటర్ ఆధ్వర్యంలో క్లార్క్స్‌బర్గ్‌లోని హోలీవెల్స్ మిడిల్ స్కూల్లో స్వామీజీ భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అద్భుతమైన ప్రవచనంతో అనుగ్రహించారు. టెక్సాస్ రాష్ట్రంలోని హ్యూస్టన్‌లో హనుమాన్ దత్త యోగా సెంటరును సందర్శించి పవిత్రమైన శ్రీచక్ర పూజ నిర్వహించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న సింధూర కార్యసిద్ధి హనుమాన్ ఆలయానికి మద్దతుగా స్వామీజీ తన విశిష్ట సంగీత కార్యక్రమమైన ‘వేణు రాగసాగర’ను భక్తులకు కానుకగా అందించారు. ఆర్చర్డ్ నగర మేయర్ మోర్గాన్ సుపాక్ హాజరై దత్త యోగ సెంటరు నిర్మాణానికి సంబంధించిన అధికారిక ప్రకటన పత్రాన్ని స్వామీజీకి అందజేశారు. హ్యూస్టన్‌లోని భారత కాన్సుల్ జనరల్ డీసీ మంజునాథ్ స్వామీజీ దివ్యాశీస్సులు పొందారు.

అనంతరం స్వామీజీ టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో ఉన్న కార్యసిద్ధి హనుమాన్ ఆలయానికి విచ్చేయగా శోభాయాత్రతో స్వాగతించారు. ఆయన ఆలయంలోని దేవతామూర్తులను దర్శించుకుని హారతి సమర్పించారు. భారతదేశంలోని వివిధ సంప్రదాయాలను ప్రతిబింబించే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలను వైభవంగా నిర్వహించారు. నాగ ప్రతిష్ఠ కోసం పవిత్ర యంత్ర స్థాపనను వైదిక పద్ధతిలో నిర్వహించారు. అమెరికాలోని అనేక నగరాల్లో దత్త పీఠం శాఖలను స్థాపించామని, వాటిల్లో దేవతామూర్తులను దర్శించి మన హిందూ ప్రాచీన





ధర్మాన్ని, సంస్కృతిని తెలుసుకుని మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. డల్లాస్‌లోని క్రెడిట్ యూనియన్ ఆఫ్ టెక్సాస్ ఈవెంట్ సెంటర్లో స్వామీజీచే ‘స్వర్ణ యాత్ర రాగసాగర” అనే ‘మ్యూజిక్ ఫర్ మెడిటేషన్ అండ్ హీలింగ్’ కాన్సెర్ట్ నిర్వహించారు. వేలాది మందితో భగవద్గీత పారాయణ మహా యజ్ఞం నిర్వహించారు. ప్రవాస భారతీయుల్లోని చిన్నారుల నుంచి పెద్దల వరకు భగవద్గీత 18 అధ్యాయల్లోని శ్లోకాలను కంఠస్థం చేసి పారాయణ చేశారు.

నెబ్రాస్కా రాష్ట్రంలోని ఒమహా నగరంలో హిందూ దేవాలయానికి విచ్చేసిన స్వామీజీకి అర్చకులు, ట్రస్టీలు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఆయన దేవతామూర్తులను దర్శించుకుని హనుమాన్ ఆలయ సమీపంలో నిర్మించిన తోరణ స్తంభాలను ప్రారంభించారు. ఫ్రీమాంట్ (కాలిఫోర్నియా)లోని కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో శ్రీచక్ర పూజ నిర్వహించారు. కేఎస్‌హెచ్‌టీ ఫ్రీమౌంట్ బృందం భజనలు చేయగా స్వామీజీ దశావతార మంత్రాన్ని వివరించారు. చికాగోలోని (కార్పెంటర్స్ విల్) శ్రీకృష్ణ దత్త హనుమాన్ ఆలయం వద్ద ఎస్‌జీఎస్ దత్తాజీ మార్గ్‌ను ఆయన ప్రారంభించారు. స్వామీజీ గౌరవార్థం ప్రపంచంలోనే తొలిసారిగా ఒక వీధికి ఆయన పేరు పెట్టడం ఎంతో గొప్ప విశేషం. కార్పెంటర్స్‌విల్ గ్రామ అధ్యక్షుడు, పలువురు ప్రముఖులను సత్కరించారు.

కృష్ణ దత్త హనుమాన్ ఆలయంలో ధన్వంతరి హోమం పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామీజీ పవిత్రమైన శ్రీచక్ర పూజ నిర్వహించారు. విద్వాన్ జైత్ర వారణాసి శిష్యులు సంగీత సేవ జరిపారు. భీమన అమావాస్య పర్వదినం విశిష్టతను, ప్రాముఖ్యతను స్వామీజీ వివరించగా భక్తులు అనఘా వ్రతం ఆచరించారు. సాయంత్రం ‘కృష్ణ దత్త రాగసాగర’ ద్వారా భక్తులను అనుగ్రహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంతో అమెరికాలో స్వామీజీ చారిత్రాత్మక స్వర్ణ యాత్ర ముగిసింది.

# మీలో క్రీడాసక్తి ఇనుమడించాలి

**ఖేలో ఇండియా సంవాద్‌లో యువతకు ప్రధాని మోదీ పిలుపు**



దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్(డైలాగ్) కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలని మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాసక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. ఒలింపిక్స్‌లో భారత్ తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అథ్లెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు.

**ఖేలో ఇండియా గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం**

డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు.




# వీసాలపై ఎన్నారైలకు మళ్లీ సవాళ్లు

**అపాయింట్‌మెంట్లను రీషెడ్యూల్ చేయనున్న అమెరికా**

అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది.

అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్‌మెంట్లను మార్చుతున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తుదారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందించారు. ఇటీవలి కాలంలో అమెరికాలో హెచ్-1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం అమెరికా యూనివర్సిటీలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

అందువల్ల వీసా ఇంటర్వ్యూ తేదీలో ఆలస్యం విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలను, ఉద్యోగుల జాబ్ ఆఫర్లు, రీలొకేషన్ ప్లాన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు లేదా హెచ్-1బీ వర్క్ వీసాల జారీని పూర్తిగా నిలిపివేయలేదు. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌లో అంతరాయం మాత్రమే ఏర్పడుతోంది. అమెరికా ఇప్పటికే భారతీయ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులకు ముఖ్యమైన గమ్యస్థానంగానే ఉంది. అయితే వీసా స్క్రీనింగ్, హెచ్-1బీ ఖర్చులు, ఎంపిక విధానం, ఎఫ్-1 నిబంధనలు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

# దుఃఖసాగరంలో ఈశా పరివారం




ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు ఫాలోవర్లు కన్నీరుమున్నీరవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేకపోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజ్ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రళయం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

# మన సుదర్శన చక్రంతో దాయాదికి దడదడ

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను రిటైర్డ్ ఎయిర్ చీఫ్ మార్షల్ జితేంద్ర సింగ్ తాజాగా పంచుకున్నారు. సుదర్శన చక్రం (ఎస్ -400 గగనతల రక్షణ వ్యవస్థ) జాడ కనుక్కునేందుకు దాయాది దేశం నానా ప్రయత్నాలు చేసిందని చెప్పారు. భారత్‌లోని గూఢచార స్లీపర్ సెల్స్‌ను కూడా క్రియాశీలకం చేసిందని చెప్పారు. ఎస్-400 దెబ్బకు పాక్ భారత్ వైపు యుద్ధ విమానాలను పంపేందుకు వణికిపోయిందని చెప్పారు. పాక్ విమానంలో గగనతలంలో కనిపించగానే ఎస్-400తో దాడి చేసేవాళ్లమంటూ నాటి విషయాల గురించి చెప్పారు. 'ఎస్-400 జాడను కనుక్కునేందుకు వాళ్లు రకరకాల ప్రయత్నాలు చేశారు. తమకు అందుబాటులో ఉన్న ప్రతి సాధనాన్నీ వినియోగించుకున్నారు. ఇతర దేశాల శాటిలైట్లతో మన ఎస్-400 జాడ కనుక్కునే ప్రయత్నం కూడా జరిగింది. వాళ్ల యుద్ధ విమానం గగనతలంలోకి వచ్చిన ప్రతీసారి ఎస్-400కు బలైపోయింది. చివరకు వారు భారత్‌లోని గూఢచార స్లీపర్ సెల్స్‌ను క్రియాశీలకం చేసి ఎస్-400 జాడను కనుక్కునే ప్రయత్నం చేశారు' అని చెప్పారు. భారత్ దేశ గగనతల రక్షణ వ్యవస్థకు ఎస్-400 కీలకంగా మారిన విషయం తెలిసిందే. ఈ వ్యవస్థను రష్యా రూపొందించింది.




# ఉగ్రలింకులపై ఏటీఎస్ ఆరా

**30 మందికి పైగా వ్యక్తుల విచారణ**

పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) దర్యాప్తును మరింత ముమ్మరం చేసింది. గత నాలుగు నెలల్లో ఉగ్ర కార్యకలాపాలకు సంబంధించిన 52 మంది అనుమానితులను ఏటీఎస్ అరెస్టు చేసింది. వారిని విచారించగా మరో 150 మందికి పైగా అనుమానితుల వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వారి పరిచయాలు, కార్యకలాపాలకు సంబంధించిన కీలక అంశాలను ఏటీఎస్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఇప్పటికే గుర్తించిన అనుమానితుల్లో 60 మందికి పైగా వ్యక్తులను విచారించినట్లు ఏటీఎస్ అధికారులు వెల్లడించారు. వారి సోషల్ మీడియా ఖాతాలు, చాటింగ్ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ నెట్‌వర్క్‌లను పరిశీలించినట్లు చెప్పారు. అరెస్టయిన 52 మంది నిందితులతో సోషల్ మీడియా ద్వారా సంబంధాలు కొనసాగించిన మరో 20 మందిని ఏటీఎస్ గుర్తించిందని.. వారి పైనా ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. అయితే వారందరికీ ఉగ్ర నెట్‌వర్క్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని ఏటీఎస్ భావించడం లేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే, 52 మంది నిందితులతో వీరికి కేవలం పరిచయం లేదా సోషల్ మీడియా సంబంధం మాత్రమే ఉందా?, లేక పాకిస్థాన్‌కు చెందిన నెట్‌వర్క్‌తో లోతైన సంబంధాలు కలిగి ఉన్నారా? అన్న అంశంపై దృష్టి సారించినట్లు తెలిపారు. అరెస్టయిన 52 మంది నిందితులు పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టి, అతడి నెట్‌వర్క్‌కు స్లీపర్ సెల్స్‌గా పనిచేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిపై దహనకాండ ద్వారా బీభత్సం సృష్టించడం, పేలుళ్లకు కుట్ర పన్నడం, పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్లకు అనుకూలంగా పోస్టర్లు ఏర్పాటు చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు దర్యాప్తులో భాగంగా అనుమానితులందరి సోషల్ మీడియా సంభాషణలు, ఇతర డిజిటల్ కార్యకలాపాలను ఏటీఎస్ నిశితంగా పరిశీలిస్తోందన్నారు. అదేవిధంగా వారి బ్యాంకు లావాదేవీలపైనా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు ఏమైనా జరిగాయా?, నిధుల బదిలీకి సంబంధించిన ఆధారాలు ఉన్నాయా? అన్న కోణంలోనూ దర్యాప్తు సాగుతోందని తెలిపారు.




# భారీ వరదలతో నేపాల్లో భయానక విధ్వంసం

## భారీ ప్రాణ, ఆస్తి నష్టం దెబ్బతిన్న పట్టణాలు, గ్రామాలు

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉద్ధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకుపోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు

# అలాస్కాలో ఘోర విమాన ప్రమాదం

## నలుగురు ప్రయాణికుల దుర్మరణం

అమెరికాలోని అలాస్కాలో విమాన ప్రమాదం జరిగింది. యాంకరేజ్ నుంచి సెల్డోవియా వెళ్తున్న చిన్న విమానం నీటిలో కుప్పకూలింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురూ మృతి చెందారు. బుధవారం ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విమాన ప్రమాదానికి కారణమేంటనేది ఇంకా బయటపడలేదు. పైపర్ పీఏ-24 విమానం బుధవారం యాంకరేజ్‌లోని మెరిల్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి సెల్డోవియా వైపు పయనమైంది. సెల్డోవియా ఎయిర్‌పోర్టుకు చేరుకునేలోపే విమానం అదుపు తప్పి సెల్డోవియా స్లఫ్‌లోని నీటిలో కూలిపోయింది. ప్రమాదం తర్వాత విమానం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. సుమారు 15 అడుగుల లోతులో విమానం ఉన్నట్లు నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అలాస్కా ప్రాంతీయ అధికారి క్లింట్ జాన్సన్ తెలిపారు. నీటి మట్టం, ఆటుపోట్ల కారణంగా రెస్క్యూ సిబ్బంది వెంటనే విమానం వద్దకు చేరుకోలేకపోయారు. ఆ తర్వాత అతి కష్టం మీద అధికారులు విమానం వద్దకు చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. విమానంలో ఉన్న నలుగురూ వయసులో పెద్దవారేనని అధికారులు తెలిపారు. మృతదేహాలను వైద్య పరీక్షల కోసం స్టేట్ మెడికల్ ఎగ్జామినర్ కార్యాలయానికి తరలించారు. విమానం ఎందుకు కూలిపోయిందనే దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదు.



# నేపాల్ మెరుపు వరదల్లో 644 మంది గల్లంతు



నేపాల్ భోటేకోశీ నది మెరుపు వరదలపై ఆ దేశ టూరిజం బోర్డు గురువారం కీలక ప్రకటన విడుదల చేసింది. రసువా, నువాకోట్, ధాదింగ్, గోర్ఖా ప్రాంతాల్లో భోటేకోశీ, త్రిశూలి నదుల వరదల ప్రభావం పడిందని ఆ ప్రకటనలో పేర్కొంది. మొత్తం 644 మంది పర్యాటకులు/ప్రయాణికులు గల్లంతైనట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపింది. గల్లంతైన వారిలో 127 మంది నేపాల్ పౌరులు, 517 మంది విదేశీయులు ఉన్నారని వెల్లడించింది. గల్లంతైన విదేశీయుల్లో 178 మంది భారతీయులు, ఆస్ట్రేలియాకు చెందిన వారు 35 మంది, ఉక్రెయిన్ 53, అమెరికా 65, మలేషియా 51, కెనడా 25, యూకేకు చెందిన వారు 33 మంది ఉన్నారని పేర్కొంది.



# నేపాల్ వరదల్లో కేంద్ర మాజీ మంత్రి కోడలు గల్లంతు

నేపాల్ వరదల్లో మాజీ కేంద్ర మంత్రి ముకుల్ రాయ్ కోడలు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శుభ్రాన్షు రాయ్ భార్య శర్మిష్ఠ భౌమిక్ రాయ్ గల్లంతయ్యారు. శర్మిష్ఠ కోల్‌కతాకు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా కైలాస మానససరోవర యాత్ర కోసం ఆగస్టు 21వ తేదీన నేపాల్ వెళ్లారు. ఆమె ఆగస్టు 25వ తేదీ (మంగళవారం) రాత్రి 11:30 గంటల సమయంలో శుభ్రాన్షు రాయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాను టిబెట్ సరిహద్దుకు సమీపంలోని 'కైరోంగ్' ప్రాంతంలో ఉన్నట్లు భర్తతో చెప్పారు. బుధవారం ఉదయం నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భారీ ఎత్తున మెరుపు వరదలు వచ్చాయి. అప్పటినుంచి శర్మిష్ఠతో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోయింది. తన భార్య పేరు మిస్సింగ్ లిస్ట్‌లో ఉందని శుభ్రాన్షు రాయ్ ధ్రువీకరించారు. కేవలం శర్మిష్ఠ మాత్రమే కాకుండా, ఆమెతో పాటు యాత్రకు వెళ్లిన కోల్‌కతాకు చెందిన 32 మంది యాత్రికుల బృందం ఆచూకీ లేకుండా పోయింది. వారి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు భారత రాయబార కార్యాలయాన్ని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆశ్రయించారు.

# నేపాల్‌కు పొంచివున్న మరో ప్రళయం

నేపాల్‌కు ఎగువన మరో ముప్పు రూపుదిద్దుకుంటోందని చైనా తాజాగా హెచ్చరించింది. మరో మూడు రోజుల్లో నేపాల్‌లో మరో జలప్రళయం సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. చైనా నీటి వనరుల శాఖ ప్రకటన ప్రకారం, ఫోచెన్ ఖోలా, పురెపు శాంగ్పో నదుల సంగమానికి దిగువన నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడటంతో అక్కడ ఓ భారీ సరస్సు తయారైంది. కొండచరియలు లేదా మంచుచరియలు విరిగిపడి నదీ ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడిన సందర్భాల్లో ఇలాంటి సరస్సులు సహజంగా ఏర్పడుతుంటాయి. ఆ సరస్సులో గురువారం నాటికి 2 మిలియన్ ఘనపు మీటర్ల జలరాశి ఉన్నట్లు చైనా గుర్తించింది. రాబోయే మూడు రోజుల్లో మరో మూడు మిలియన్ ఘనపు మీటర్ల నీరు చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. చివరకు కట్ట తెగి దిగువన ఉన్న నదుల్లో వరద పోటెత్తే అవకాశం ఉందని హెచ్చరించింది. కంప్యూటర్ల సాయంతో చైనా ఇంజినీర్లు వరద ఉధృతిని అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేపాల్‌లోని త్రిశూలీ, భోటేకోశీ, నారాయణి నదీ తీరాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అక్కడి ప్రభుత్వం సూచించింది.






# రష్యాలోని ఏజీసీసీ ప్లాంట్‌లో భారీ పేలుడు

## ఏడుగురి మృతి, 152 మందికి గాయాలు

రష్యాలోని తూర్పు అమూర్ ప్రాంతంలో ఘోర ప్రమాదం సంభవించింది. అమూర్ గ్యాస్ కెమికల్ కాంప్లెక్స్‌లో భారీ పేలుడు సంభవించి ఏడుగురు కార్మికులు మృతిచెందగా, మరో 152 మంది గాయపడ్డారు. తీవ్రగాయాలైన 36 మందిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో 9 మంది ఆచూకీ గల్లంతైంది. మృతుల్లో ఆరుగురు చైనా జాతీయులు ఉన్నట్లు ఏజీసీసీ యాజమాన్యం తెలిపింది. ఏజీసీసీ ప్లాంట్ ప్రారంభానికి ముందు ప్రీ-కమిషనింగ్ పనులు జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగ ఆ ప్రాంతం మొత్తం వ్యాపించింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కాగా, రష్యాలోని స్వోబోడ్నీ సమీపంలో అమూర్ గ్యాస్ కెమికల్ కాంప్లెక్స్‌ను రష్యా, చైనా దేశాలు సంయుక్తంగా నిర్మించాయి. ఈ ప్రాజెక్టు విలువ సుమారు 10 బిలియన్ డాలర్లు. రష్యన్ పెట్రోకెమికల్ కంపెనీ సిబూర్, చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, గ్యాస్ దిగ్గజం సినోపెక్ దీనిని నిర్మించాయి. పాలిథిలీన్, పాలీప్రొపిలీన్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రపంచంలోనే అతి పెద్ద పరిశ్రమగా దీనిని రూపొందించారు. ప్రతి రోజూ నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ కాంప్లెక్స్ సమీపంలోని అమూర్ గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్ నుంచి ముడి పదార్థాలను సేకరించి వాటిని ప్లాస్టిక్ తయారీ పదార్థాలుగా మార్చేందుకు ఏజీసీసీని తీర్చిదిద్దారు. పరిశ్రమ పూర్తి కార్యకలాపాలు ప్రారంభిస్తే ప్రతి ఏటా సుమారు 2.3 మిలియన్ టన్నుల పాలిథిలీన్, నాలుగు లక్షల టన్నుల పాలీప్రొపిలీన్‌ను ఉత్పత్తి చేస్తుంది.

# భారత్ విజయాన్ని అడ్డుకున్న దినుష

- భారత్ విజయాన్ని అడ్డుకున్న దినుష
- డ్రాగా ముగిసిన కొలంబో టెస్టు
- 1-0తో సిరీస్ గెలుచుకున్న శుభ్‌మన్ గిల్ సేన





కొలంబో టెస్టులో విజయంతో డబ్ల్యూటీసీలో ముందంజ వేయాలనుకున్న భారత జట్టు ఆశలు ఆవిరయ్యాయి. ఐదో రోజూ సొనాల్ దినుష (133 నాటౌట్)ను ఔట్ చేయలేక మ్యాచ్‌ను డ్రాగా ముగించింది టీమిండియా. రెండు సెషన్లలోనూ రవీంద్ర జడేజా(3-94)కు సహకరించే బౌలర్ కరువవ్వగా .. రికార్డు శతకాలు బాదేసిన దినుష లంకను ఓటమి నుంచి తప్పించాడు. దాంతో శుభ్‌మన్ గిల్ సేన 1-0తో సిరీస్‌ను గెలుచుకుంది.

తొలి రెండు రోజులు కొలంబోలో పైచేయి టీమిండియాదే. మూడో రోజు కూడా బౌలర్లు చెలరేగడంతో భారత్ గెలుపు నల్లేరుమీద నడకే అనుకున్నారంతా. కానీ అందరి అంచనా తప్పంది. శ్రీలంక ఆట మారింది. ఫలితంగా.. ఫాలో ఆన్ గండం దాటలేక.. ఓటమి అంచున నిలిచిన శ్రీలంక సొనాల్ దినుష (103, 133 నాటౌట్) వరుస శతకాలతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

గాలే టెస్టులో చిత్తుగా ఓడిన శ్రీలంక కొలంబోలో గొప్పగా ఆడింది. టాపార్డర్ విఫలమైనా... పసిద్ సూర్యబండార (92), సొనాల్ దినుష (133 నాటౌట్ (264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు) అసమాన పోరాటంతో ఓటమిని తప్పించారు. తొలి ఇన్నింగ్స్‌లో శతకం (103)తో మెరిసిన దినుష.. ఐదో రోజూ గోడ కట్టాడు. భారత బౌలర్లకు కొరకరాని కొయ్యలా మారిన అతడు నువాంత (46), లహిరు కుమార (12)లతో విలువైన భాగస్వామ్యాలతో లంక ఆధిక్యాన్ని పెంచుతూ పోయాడు. క్రీజులో పాతుకుపోయిన దినుష భారత స్పిన్నర్లు, పేసర్లకు వెరవలేదు. నింపాదిగా ఆడుతూ తన జట్టును గట్టెంచడమే లక్ష్యంగా చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ సంకల్పంతో టీ బ్రేక్ సమయానికి 8 వికెట్ల నష్టానికి 383 రన్స్ కొట్టిన ఆతిథ్య జట్టుకు డ్రాపై ఆశలు చిగురించాయి. కాసేపటికే సింగిల్‌తో శతకం అందుకున్న దినుష ఆపై సిక్సర్లతో చెలరేగాడు.

చివరి బ్యాటర్ అసితా ఫెర్నాండో సైతం పట్టుదలగా ఆడగా.. మ్యాచ్ గెలిచే పరిస్థితులు లేవని టీమిండియాకు అర్థమైంది. లంక 429/9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఆట ముగిసేందుకు మరో 17 ఓవర్లు ఉన్నప్పటికీ.. ఫలితం తేలే అవకాశాలు కనిపించనందున ఇరు జట్ల ఆటగాళ్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా ఒక్కడే మూడు వికెట్లతో రాణించాడు. దేవ్‌దత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల (115) శతకాలతో తొలి ఇన్నింగ్స్‌ను టీమిండియా 503/9 వద్ద డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే.

# లింగేశ్ బౌలింగ్ మాయాజాలం

*హ్యాట్రిక్ వికెట్లు... ఐదుగురు బ్యాటర్లు గోల్డెన్ డకౌట్ - భారత టీ20 చరిత్రలో అరుదైన రికార్డు*



టీ20లో తరచూ అనేక రికార్డులు నమోదవుతాయి. కానీ కొన్ని సందర్భాల్లో మాత్రమే అరుదైనవి సంభవిస్తాయి. తాజాగా అలాంటి రెండు రికార్డులకు తమిళనాడు ప్రీమియర్ లీగ్ వేదికైంది. తొలి ఓవర్‌లో మొదటి మూడు బంతులకే హ్యాట్రిక్ వికెట్లు పడటమే కాకుండా.. ఏకంగా ఐదుగురు బ్యాటర్లు గోల్డెన్ డకౌట్ అయ్యారు. ఈ రెండు అద్భుతాలు టీఎన్‌పీఎల్-2026లో భాగంగా తిరుచ్చి గ్రాండ్ చోళాస్-విదా కోవై కింగ్స్ జట్ల మధ్య జరిగిన క్వాలిఫయర్ -2 మ్యాచ్‌లో చోటుచేసుకున్నాయి.

టాస్ గెలిచిన విదా జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసింది. అనంతరం 184 పరుగుల టార్గెట్‌తో బ్యాటింగ్ దిగిన తిరుచ్చి జట్టు.. విదా పేసర్ దీబన్ లింగేశ్ ధాటికి 99 పరుగులకే ఆలౌటైంది. తొలి ఓవర్ వేసిన లింగేశ్.. మొదటి మూడు బంతులకే మూడు వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ సాధించాడు. భారత టీ20 చరిత్రలో తొలి మూడు బంతులకే హ్యాట్రిక్ వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా లింగేశ్ నిలిచాడు. ఆ తర్వాత మూడు బంతులకు పరుగులు ఇవ్వకుండా బ్యాటర్లను కట్టడి చేశాడు. తిరుచ్చి ఓపెనర్ రాజ్‌కుమార్‌ను ఇన్నింగ్స్ తొలి బంతికే పెవిలియన్‌కు చేర్చిన లింగేశ్.. రెండో బంతికి శ్యామ్ సుందర్, మూడో బంతికి జగదీశన్‌ను ఔట్ చేశాడు.

ఇదే మ్యాచ్‌లో మరో సంచలనం కూడా నమోదైంది. తిరుచ్చి జట్టులో ఐదుగురు బ్యాటర్లు.. తాము ఆడిన తొలి బంతికే (గోల్డెన్ డక్) ఔటయ్యారు. ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. మరో ఐదుగురు పరుగుల ఖాతా కూడా తెరవలేదు. అందరూ గోల్డెన్ డక్‌లే కావడం గమనార్హం. ఓపెనర్ రాజ్‌కుమార్, శ్యామ్‌సుందర్, జగదీశన్, జాఫర్ జమాల్, అతిసాయరాజ్ దేవిడ్సన్ తొలి బంతికే ఔటయ్యారు. ఇలా భారత టీ20 మ్యాచ్‌లో ఐదుగురు బ్యాటర్లు గోల్డెన్ డక్ కావడం ఇదే తొలిసారి. గోల్డెన్ డక్ అయిన ఐదుగురు బ్యాటర్లలో ముగ్గురిని విదా బౌలర్ దీబన్ లింగేశ్ పెవిలియన్‌కు పంపించాడు. తన పదునైన బౌలింగ్‌లో తిరుచ్చి ఓటమిని శాసించిన లింగేశ్.. ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందుకున్నాడు.




# 48 గంటల్లో 26 వేల టికెట్లు

**- భారత్ మ్యాచ్‌లకు విపరీతమైన డిమాండ్**
**- న్యూజిలాండ్‌లో 'హాట్ కేక్' సేల్**

టీమ్‌ఇండియా ఎక్కడ అడుగుపెడితే అక్కడ కాసుల వర్షం కురుస్తుందనేందుకు న్యూజిలాండ్ పర్యటన క్రేజే ప్రత్యక్ష ఉదాహరణ. మరో రెండు నెలల్లో భారత జట్టు కివీస్ గడ్డపై అడుగుపెట్టనుంది. ఈ పర్యటనలో భాగంగా ఇరు జట్లు మూడు ఫార్మాట్లలో (5 వన్డేలు, 5 టీ20లు, 2 టెస్టులు) మొత్తం 12 మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. ఐదు వేదికల్లో ఈ పోరు జరగనుంది. ఈ సిరీస్ కోసం కివీస్ క్రికెట్ బోర్డు నిర్వహించిన 'ప్రీ సేల్' ప్రారంభించిన కేవలం 48 గంటల్లోనే ఏకంగా 26 వేల టికెట్లు అమ్ముడవడం విశేషం. అక్టోబరులో టీ20 సిరీస్‌తో ఈ సుదీర్ఘ పర్యటన ప్రారంభం కానుంది. తొలి రెండు టీ20లతో పాటు ఓ టెస్టు మ్యాచ్‌కు క్రిస్ట్‌చర్చ్ మైదానం వేదిక కానుంది. ఈ స్టేడియం కెపాసిటీ 9వేలు మాత్రమే కావడం గమనార్హం. మిగతా మూడు మ్యాచ్‌లు వెల్లింగ్టన్, ఆక్లాండ్, హామిల్టన్ మైదానాల్లో జరగనున్నాయి. కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్‌కే కాకుండా టెస్టు మ్యాచ్‌లను వీక్షించేందుకు కూడా అభిమానుల నుంచి విపరీతమైన డిమాండ్ కనిపిస్తోందని కివీస్ చీఫ్ మార్కెటింగ్, కమర్షియల్ ఆఫీసర్ గ్లెన్ క్రిచ్‌లే తెలిపారు. "తొలి రెండు రోజుల్లోనే రికార్డు స్థాయిలో సేల్స్ నమోదయ్యాయి. భారత్ వంటి బడా జట్టుతో కివీస్ తలపడే మ్యాచ్‌లను నేరుగా చూసే అవకాశం స్థానిక అభిమానులకు చాలా అరుదుగా లభిస్తుంది. గత సీజన్ మాదిరిగానే ఈసారి కూడా అందరికీ అందుబాటు ధరల్లోనే టికెట్లను ఉంచాం. నేషన్ యాక్సెస్ కోడ్ ద్వారా 30 డాలర్ల కంటే తక్కువ ధరకే అభిమానులకు టికెట్లు లభిస్తున్నాయి. ఈ ప్రీ సేల్‌కు దక్కిన ఆదరణ సంతోషాన్నిచ్చింది. సెప్టెంబరు 7 నుంచి సాధారణ టికెట్లను అందుబాటులోకి తెస్తాం" అని గ్లెన్ వెల్లడించారు.



# ఆసియా చెస్ విజేతలు మయాంక్, ప్రతీతి

ముంబై: ఆసియా జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు మయాంక్ చక్రవర్తి, ప్రతీతి బోర్డోలోయ్ టైటిళ్లు సొంతం చేసుకున్నారు. బుధవారం జరిగిన క్లాసికల్ ఆఖరి రౌండ్‌ను డ్రా చేసుకున్న మయాంక్ 7.5 పాయింట్లతో విజేతగా నిలవగా ఆర్టిం పిన్‌జిన్ (రష్యా), భారత ఆటగాడు దక్ష్ గోయెల్ రజత, కాంస్య పతకాలు సాధించారు. బాలికల క్లాసికల్ విభాగంలో ప్రతీతి కూడా ఆఖరి రౌండ్‌ను డ్రాగా ముగించి 7.5 పాయింట్లతో స్వర్ణం దక్కించుకోగా మరియా ఖోల్యావ్‌కో (కజకిస్థాన్) రజతంతో, భారత క్రీడాకారిణి నివేదిత కాంస్యంతో మెరిశారు. తెలుగు క్రీడాకారులు శరణ్య, అద్వైత్ వారి విభాగాల్లో ఆరో స్థానంతో నిరాశపర్చారు.

# భారత్-అఫ్గన్ టీ20 సిరీస్ మీడియా హక్కులు పాకిస్థాన్ సంస్థకు




భారత్, అఫ్గనిస్థాన్ టీ20 సిరీస్‌ను పాకిస్థాన్ కంపెనీ లైవ్ ప్రసారం చేయనుంది. సెప్టెంబరులో మొదలయ్యే ఈ పొట్టి సిరీస్ వాణిజ్య, గ్లోబల్ ప్రసార హక్కులను పాక్‌కు చెందిన ట్రాన్స్‌గ్రూప్ సొంతం చేసుకుంది. అదేంటీ అని ఆశ్చర్యపోతున్నారా! అయితే పాక్ కంపెనీకి ఈ బాధ్యతలు అప్పగించింది బీసీసీఐ కాదు.. అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు. సెప్టెంబరు రెండో వారంలో భారత్, అఫ్గనిస్థాన్ మధ్య మూడు టీ20ల సిరీస్ మొదలవ్వనుంది. మామూలుగా టీమిండియా సిరీస్ హక్కులు సోనీ స్పోర్ట్స్ లేదా జియో స్టార్ కంపెనీలు దక్కించుకుంటాయి. కానీ ఆశ్చర్యంగా ఇరుజట్ల సిరీస్ మీడియా, వాణిజ్య హక్కులను పాకిస్థాన్‌కు చెందిన ట్రాన్స్‌గ్రూప్ కంపెనీ దక్కించుకుంది.

అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు 'గ్లోబల్ మీడియా రైట్స్ సిండికేట్ భాగస్వామి'గా ఉంది ట్రాన్స్ గ్రూప్. అందుకే... ఈ కంపెనీకి తమ జట్టు ఆడుతున్న సిరీస్ ప్రసార హక్కులు కట్టబెట్టింది ఏసీబీ. అందుకు బీసీసీఐ కూడా అభ్యంతరం చెప్పలేదు. కానీ మన దేశంలో మాత్రం సోనీ స్పోర్ట్స్, ఫ్యాన్‌కోడ్.. ఈ సిరీస్‌ను ప్రసారం చేయనున్నాయి. సెప్టెంబరు 13, 15, 17 తేదీల్లో భారత్, అఫ్గనిస్థాన్ టీ20ల్లో తలపడతాయి. ఇరుజట్ల మధ్య ఇదే మొట్టమొదటి ద్వైపాక్షిక సిరీస్ అయినప్పటికీ మ్యాచ్‌లు మాత్రం ఇండియాలోనే జరుగుతాయి.

# చైతన్య రథం సినిమా

శుక్రవారం 28 ఆగస్టు 2026 X

## ‘ఫోర్బ్స్’ కవర్ పేజీపై
# తళుక్కుమన్న ఐకాన్ స్టార్




జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరో అరుదైన ఘనత సాధించారు. భారతదేశంలోని టాప్ 100 సెలబ్రిటీలను గౌరవిస్తూ ప్రతిష్టాత్మకంగా విడుదల చేసిన ‘ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026’ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన తళుక్కుమన్నారు. వినోద, క్రీడలు, పాపులర్ కల్చర్ రంగాలకు చెందిన దేశంలోని ప్రముఖులతో రూపొందించిన ఈ ప్రత్యేక సంచికలో అల్లు అర్జున్ ముఖ చిత్రంగా నిలవడం విశేషం. ‘పుష్ప’ ఫ్రాంచైజీతో తెలుగు సినిమా సరిహద్దులను దాటి, దేశవ్యాప్తంగా ఓ పాన్-ఇండియా సాంస్కృతిక ప్రభంజనంగా మారిన ఆయన క్రేజ్‌కు ఈ గుర్తింపు నిదర్శనంగా నిలిచింది.

ఈ సందర్భంగా అల్లు అర్జున్ భారతీయ సినిమా ప్రస్తుత పరిస్థితిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. బాలీవుడ్ కావచ్చు, సౌత్ సినిమా కావచ్చు లేదా మరే ప్రాంతీయ సినిమా అయినా సరే సాధారణ కంటెంట్ ఇకపై ఎప్పటికీ వర్కౌట్ కాదని, గొప్ప కంటెంట్‌ను అందించడమే ప్రధానమని పేర్కొన్నారు.

బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించడంతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా దేశవ్యాప్తంగా తన ప్రభావం చూపుతున్న అల్లు అర్జున్ ఈ ఫోర్బ్స్ ఇండియా కవర్ పేజీ ద్వారా తన స్థాయిని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పారు. కాగా ఇదే ‘షోస్టాపర్స్ 2026’ టాప్-100 జాబితాలో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ కూడా స్థానం సంపాదించుకున్నారు.

## సినిమా నచ్చకపోతే అమీర్‌పేట్‌లో
# గుండు కొట్టించుకుంటా

**హీరోయిన్ శ్వేతా లక్ష్మణ్ ఛాలెంజ్**




టాలీవుడ్‌లో సరికొత్త ప్రేమకథా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ‘సహ లైఫ్ ఆఫ్ సంజు) ట్రైలర్ లాంచ్‌ఈవెంట్ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. యువ నటులు శివకుమార్ కాసారం,శ్వేతా లక్ష్మణ్ జంటగా నటిస్తున్న ఈచిత్రానికి నిశాంత్ దోటి దర్శకత్వం వహించగా తేజేశ్వర్ వేల్పుచర్ల నిర్మించారు.వ్రజన పాండ్య, మహిపాల్, సునీల్ కీలక పాత్రలు పోషించారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం సెప్టెంబరు 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ శ్వేతా లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. సినిమాపై ఉన్న నమ్మకంతో ఆమె మాట్లాడుతూ.. “నేను మిమ్మల్ని రిక్వెస్ట్ చేయట్లేదు, ఛాలెంజ్ చేస్తున్నాను. సినిమా చూశాక మీరందరూ ఒక గొప్ప సినిమా చూశామే అనే సంతృప్తితోనే బయటికి వస్తారు తప్ప నిరాశతో రారు. ఒకవేళ ఈ సినిమా మీకు నచ్చకపోతే నేను అమీర్‌పేట్ సెంటర్‌లో నిలబడి గుండు కొట్టించుకుంటాను” అంటూ సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు ఈ చిత్రంలో నటించిన హీరో శివకుమార్ కూడా సినిమా నచ్చకపోతే నా నంబర్‌కి చేసి తిట్టండంటూ బోల్డ్ కామెంట్ చేశాడు.

సంజు అనే యువకుడి జీవిత ప్రయాణం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో తొలిప్రేమ, బ్రేకప్ బాధ, మధుర జ్ఞాపకాలు, దైనందిన జీవిత సవాళ్లను అత్యంత సహజంగా ఆవిష్కరించారు. ఇది ప్రతి ఒక్కరి మనసుకు హత్తుకునే ఎమోషనల్ జర్నీగా నిలుస్తుందని చిత్రబృందం చెప్తోంది.ప్రముఖ నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాను సంయుక్తంగా విడుదల చేస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# సినిమా విజయం పరిశ్రమలో అందరికీ పండగే

**మెగాస్టార్ చిరంజీవి**



మాస్ మహారాజ్ రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఇరుముడి’ సినిమా ఘన విజయం సాధించడంపై టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా చిత్ర యూనిట్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఒక సినిమా విజయం సాధిస్తే అది ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరికీ పండుగ లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. ‘ఇరుముడి’ సినిమా ఆసాంతం ఎంతగానో ఆకట్టుకుందని చిరంజీవి తెలిపారు. ముఖ్యంగా త్రినాథ్ పాత్రను తన భుజాన వేసుకుని రవితేజ అద్భుతమైన నటన కనబరిచారని కొనియాడారు. దర్శకుడు శివ నిర్వాణ సినిమాను ఎంతో లోతుగా, భావోద్వేగాలతో తెరకెక్కించి అద్భుతమైన ప్రతిభ చూపించారని ప్రశంసించారు. బేబీ నక్షత్ర భవిష్యత్తులో మరింత ఉజ్వలమైన విజయాలు అందుకోవాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, నటులు సాయికుమార్, ప్రియాభవానీ శంకర్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సహా నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ చిరంజీవి అభినందనలు తెలిపారు. ఈ పరిశ్రమ అందరిదీ.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి! అంటూ ‘లైవ్ అండ్ లెట్ లీవ్’ అనే నినాదాన్ని ఆయన మరోసారి గుర్తు చేశారు.

# ప్రముఖ నటుడు జీవీ నారాయణరావు కన్నుమూత



హైదరాబాద్: తెలుగు చిత్రసీమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, నిర్మాత జీవీ నారాయణరావు (73) శనివారం కన్నుమూశారు. ఈ వార్తను నటి కరాటే కల్యాణి సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఆయన మృతికి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వారు ప్రస్తుతం విదేశాల్లో నివసిస్తున్నారు.

**తొలి సినిమాకే ‘నంది’ పురస్కారం:**

కృష్ణా జిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణరావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగాయి. మద్రాస్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన ఆయన రజినీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడు. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఏఆర్ కృష్ణ వద్ద నటనలో మెళకువలు నేర్చుకున్నారు. చదువుకునే రోజుల్లోనే ‘మహమ్మద్ బీన్ తుగ్లక్’, ‘ప్రతాపరుద్రీయం’ వంటి నాటకాల్లో నటించారు. కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల ఆయనకు రంగస్థల మిత్రులు. 1976లో ప్రముఖ దర్శకుడు కె.బాలచందర్ తెరకెక్కించిన ‘అంతులేని కథ’ చిత్రంతో నటుడిగా వెండి తెరకు పరిచయమైన నారాయణరావు తన తొలి చిత్రానికే ఉత్తమ సహాయ నటుడిగా ప్రతిష్టాత్మక ‘నంది’ అవార్డు అందుకున్నారు.

**100కు పైగా చిత్రాలు..**

**పలు సినిమాలకు నిర్మాత**

తన నటనా ప్రస్థానంలో వందకు పైగా చిత్రాల్లో వైవిధ్యభరితమైన పాత్రలు పోషించారు. ‘ముత్యాల పల్లకి’, ‘అంగడి బొమ్మ’, ‘చిలకమ్మ చెప్పింది’, ‘గ్యాంగ్ లీడర్’, ‘హిట్లర్’ వంటి ప్రజాదరణ పొందిన సినిమాల్లో నటించి మెప్పించారు. వెండితెరపైనే కాకుండా పలు టీవీ సీరియళ్లలోనూ నటించారు. నటుడిగానే కాకుండా ‘దేవాంతకుడు’, ‘ఇంటికో రుద్రమ్మ’, ‘యముడికి మొగుడు’, ‘పెళ్లి నీకు శుభం నాకు’ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించి నిర్మాతగా ప్రత్యేకత చాటుకున్నారు. నారాయణరావు హఠాన్మరణంపై చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం ప్రకటించారు.

# నేపాల్‌ను పునర్నిర్మిస్తాం: బాలీవుడ్ నటులు

నేపాల్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. ఇళ్లు, రోడ్లు, వంతెనలు ధ్వంసమయ్యాయి. వందల మంది మరణించగా వేల మంది గల్లంతయ్యారు. ఈ విషాద సమయంలో బాలీవుడ్ సినీ తారలు సంజయ్‌దత్, సోనుసూద్, భూమి పెడ్నేకర్, మనీషా కొయిరాలా, ప్రబల్ గురుంగ్, అరుణ్ గోవిల్ బాధితులకు సానుభూతి ప్రకటించారు. ధైర్యంగా ఉండాలని కోరారు.గల్లంతైన వారి క్షేమం కోసం దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు. నేపాల్‌ను పునర్నిర్మించేందుకు తాను కృషి చేస్తానని నటుడు, సామాజిక కార్యకర్త అయిన సోనుసూద్ ప్రకటించారు. ‘మీరు ఒంటరి కాదు. ధ్వంసమైన వాటిని పునర్నిర్మించుకోవడానికి, సహాయ పడటానికి మేం సిద్ధంగా ఉన్నాం. మీకు కావాల్సిన ఆహారం, ఆశ్రయం కల్పించేందుకు వస్తున్నాం. నేపాల్ బాధితులందరికీ నా ప్రగాఢ సానుభూతి’ అని సంజయ్‌దత్ తన ఇన్‌స్టా ఖాతాలో స్పందించారు. ఇలాంటి విపత్కర సమయంలో నేను మీకు అండగా ఉంటాను. నాకు సాధ్యమయ్యే ఏ సహాయం చేయడానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. సురక్షితంగా ఉండంటి. ధైర్యంగా నిలబడండి అని సంజయ్‌దత్ కోరారు.

నేపాల్ భీతావహ వాతావరణానికి సంబంధించిన ఫొటోలు, హెల్ప్‌లైన్ నంబర్లు, ఇతర సమాచారాన్ని మనీషా కొయిరాలా ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. బాధితుల కోసం ప్రార్థించాలని తన అభిమానులు, ఫాలోవర్లను కోరారు. భూమి పెడ్నేకర్ కూడా తన బాధను వెల్లడించారు. ఇది చాలా హృదయ విదారక విషయం. సర్వం కోల్పోయిన వారికోసం ప్రార్థిస్తున్నానన్నారు.

నేపాల్ ప్రకృతి విపత్తు ఫొటోలను చూస్తుంటే చాలా బాధ కలుగుతోందని అరుణ్ గోవిల్ పేర్కొన్నారు. ఈ ఫొటోలు లెక్కలేనన్ని కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను చూపుతున్నాయి. వారందరి భద్రత,శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నానన్నారు. వారి బాధను మాటల్లో వర్ణించలేం, ఇది చాలా హృదయవిదారకరం... అని నేపాల్‌లో జన్మించిన బాలీవుడ్ ఫ్యాషన్ డిజైనర్ ప్రబల్ గురుంగ్ అన్నారు. దుఃఖిస్తున్న, నిరాశ్రయులైన వారి కోసం, అవిశ్రాంతంగా పనిచేస్తున్న సహాయక సిబ్బంది కోసం ప్రార్థిస్తున్నాను. బాధితులందరినీ నా హృదయంలో పదిలపరుచుకుంటున్నాను అని ప్రబల్ వెల్లడించారు.



